శ్రీః

# ధ్యానము

ఆంగ్ల మూలము

## స్వామి ఓంకార్

భగవాన్ రామతీర్థుల ప్రథమశిష్యుడు పరమ పూజనీయ
నారాయణ స్వామీజీ మహరాజ్ చే వ్రాయబడిన ముందు మాటతో

తెలుగు అనువాదము :

## స్వామి తత్త్వవిదానంద సరస్వతి

SRI SANTI ASHRAM
THE MISSION OF PEACE
SANTIASHRAM (P.O)
(VIA) SANKHAVARAM
E.G.Dt. 533 446, Ph: [illegible]

ప్రచురణ

శాంతి ఆశ్రమము

తోటపల్లి, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్.

533 416.

# ధ్యానము

ఆంగ్ల మూలము : స్వామి ఓంకార్

తెలుగు సేత : స్వామి తత్త్వవిదానంద సరస్వతి

మొదటి ముద్రణము : **3 000** కాపీలు

మూల్యము : **30** రూ.

దాహార్తి గలవారు అందరు, అయ్యా! శాంతి సముద్రములోనికి దయ చేయండి, పరమాత్మ యొక్క ఆనందామృతమును ఆస్వాదించుడు. ప్రపంచము అంతా దొరికితే మాత్రం, మీ పవిత్రమైన శాంతి తొలగిపోతే, మీకు కలిగే లాభమేమి గలదు?

ప్రథమ ముద్రణ :
శ్రీ శాంతి ఆశ్రమ శతజయంతి ఉత్సవాల
సందర్భంగా 21-01-2017

సంఘమిత్ర ఫౌండేషన్, కాకినాడ వారి సౌజన్యముతో

ముద్రణ :
శ్రీ వినయ్ ప్రింటర్స్
1-8-430/ఎ, ఉమా గార్డెన్
వెంకటేశ్వర స్వామి దేవాలయము వద్ద
చిక్కడపల్లి
హైదరాబాదు - 500 020
ఫోను: 98485 64041

భగవాన్ రామతీర్థకు సమర్పితము, మరియు
ప్రేమ-శాంతి-ఏకత్వముల బంధమునందు హత్తుకొనబడుచున్న
ప్రపంచమునందలి సకలమతములకు చెందినవారికి, ఏ
మతమునకైననూ చెందని వారికి కూడ, సమర్పితము.

# ముందు మాట

(భగవాన్ రామతీర్థ ప్రథమ శిష్యుడు శ్రీ ఆర్. ఎస్. నారాయణ స్వామి వ్రాసినది)

శ్రీ స్వామి ఓంకార్ ధ్యానము పై ఈ వ్యాసమును తోటపల్లి కొండల అడవిలోని వారి శాంతి ఆశ్రమమునందు అర్ధరాత్రి నిశ్శబ్దవాతావరణములో వ్రాసిరి. వారు సర్వమును ప్రేమించే అమాయికమైన ఆత్మయందలి అనుభూతిని, మాటలలో చెప్ప శక్యము కానే కాని అనుభూతిని, యాదృచ్ఛికంగా ఈ వ్యాసములో మాటలలో చెప్పుటకు ప్రయత్నం చేసేరు. అయితేనేమి, వేదాంతశాస్త్రమునందు చెప్పబడిన యథార్థములైన ధ్యానమునకు చెందిన బోధలతో పూర్తి సమరసతతో కూడిన అంశములు ఈ వ్యాసములో పొంగి పొర్లుతున్నాయి.

ఆత్మయొక్క గభీరమైన నిగూఢతను తెలియగలిగేది ఆత్మ మాత్రమే. అగాధమైన ఆత్మయొక్క లోతును వెదికి పట్టుకొనుటకు మనస్సు ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. ఎప్పుడైతే మనస్సు తన అసమర్థతను గుర్తిస్తుందో, భోగాభిరుచి అనే సముద్రపు కెరటముయొక్క పోటుతో కూడిన అంతఃప్రవాహముతో మనస్సు పూర్తిగా తనివి దీరి విరక్తమగునో, లేదా ఎప్పుడైతే మనస్సు అంతము లేని కోరికల తరంగముల విసుర్లను శాంతపరచుకుని యుండునో, అప్పుడు మాత్రమే పూర్ణతత్త్వము (పరమాత్మ) తన నిర్దుష్టమైన ఆభాసను ప్రసన్నమైన మరియు శాంతమైన నీరు వంటి మనస్సునందు ప్రతిఫలింప జేయును.

ఎప్పుడైతే అహంకారము, అల్పమైన ఆత్మ, నేను అనే తప్పు భావన తనను తాను తుడిచివేసుకుంటుందో, ఆత్మ తనను కప్పివేసే అజ్ఞానము అనే పొగమంచునుండి బయటకు వెలువడుతుందో, అప్పుడు మాత్రమే సర్వవ్యాపకము, అఖండము అగు ఆత్మ, యథార్థమైన నేను, తన సహజసిద్ధమైన ప్రకాశమునందు ప్రకటమై సర్వమును ముంచివేయును. ఆత్మ అనగా సర్వమునకు అతీతమైన చైతన్యము. అదియే నిశ్చయముగా బ్రహ్మ. అహం బ్రహ్మోస్మి, నేను బ్రహ్మ అగుచున్నాను.

మనకు స్వాధీనమై లేనిది, కొత్తగా పొందదగినది యేదీ లేదు. మనది కానిది, మనము పట్టుకోవాల్సినది యేదీ లేదు. మనము కొత్తగా సాధించదగినది యేదీ లేదు. కొత్తగా బంధమునుండి పొందదగిన ముక్తి కూడా యేదీ లేదు. మనం చెయ్యాల్సినది ఇంత మాత్రమే: మనం సరళంగా నిత్యసిద్ధమైన శాశ్వతమైన సత్యమును పునరుద్ఘాటించి సాక్షాత్కరించుకొనవలెను. ఇదియే జీవుడు విస్మరించిన విముక్తి. ఇది జీవుని జన్మహక్కు.

పరిచ్ఛేదమునుండి అనంతత్వమునకు యాత్ర నిరంకుశస్వేచ్ఛనుండి కర్తవ్యకర్మానుష్ఠానము వైపు వేసే అడుగులతో ఆరంభమవుతుంది. శోకము, మృత్యువుల పీడ-దుఃఖములు ఆభాసలే గాని యథార్థములు గావు. ఈ ప్రయాణములో జీవుడు ఇట్టి మిథ్యనుండి పై పైకి శాశ్వతమైన ప్రాణము-ఆనందముల స్థాయిలో వర్ణింప శక్యము కాని ఆనందములోనికి ప్రవేశించును. ప్రాచీనులైన పెద్దలు ఆ స్థితిని ఇట్లు వర్ణించిరి:

మనం మరిన్ని కొత్త అందాలను చూస్తాము
ఇంకా పెరుగుతూ ఉన్న ప్రకాశమును చూస్తాము.

ద్వైతము అంటే విభజన మరియు శోకము. సర్వమును తన ఒడిలో చేర్చుకునే ప్రేమ-ఆనందముల ఏకత్వమే అద్వైతము.

సకలద్వైతమును, అనాత్మను విస్మరించి, తత్క్షణమునందే ఆంతరమైన ఏకత్వము - అదే ఆత్మ - ను సాక్షాత్కరించుకొనుటయే ధ్యానము. కాబట్టి ధ్యానముయొక్క లక్ష్యము ఈ విధముగా ఉండవలెను: మనస్సు నిరంతరముగా నిర్దుష్టమైన శాంతి మరియు ఆంతరనిశ్శబ్దముల ఆనందమునందు విలీనము కావాలి. నామరూపాత్మకమైన ప్రపంచముయొక్క బాహ్యమునందలి హడావుడి మధ్యయందు కూడా మనస్సు స్వరూపమునందు నిలిచి ఉండాలి.

స్వామి ఓంకార్ కులము-రంగు-లింగము-వయస్సు అనే భేదములను సుతరాము పట్టించుకోకుండా సకలమానవాళిని సమానంగా ప్రేమించేవారు. ఆయన తన శాంతినివాసమును, శాంతి ఆశ్రమమును, అందరికీ నచ్చేట్లుగా, అందరికీ ప్రవేశము ఉండేట్లుగా ఏర్పాటు చేసేరు. ఆయన ధ్యానతరగతులయందు పాల్గొనుటకు అందరినీ ఆహ్వానించేవారు.

అందరు యథార్థమైన ఆనందమును ఇప్పుడు ఇక్కడ అనుభవమునకు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించేవారు.

ఆయన నిరంతరంగా ప్రార్థించేవారు. ఆ ప్రార్థనలన్నీ అంతిమంగా ఆత్మ-అనుభూతి (సర్వోత్కృష్టమైన దైవీ చేతన) లో విలీనము కావాలని ఆయన ఆకాంక్షించేవారు. ఈ విషయంలో ఆయన దర్శనము స్వామి రామతీర్థ దర్శనమును అనుసరించేది. స్వామి రామతీర్థయొక్క ప్రేమ, శాంతి మరియు ఏకత్వముల సందేశమును అందరికీ, కడపటి ఇంటిలోని కడపటి వ్యక్తి వరకు, అందజేయాలనియు, తద్ద్వారా స్వామి రామతీర్థయొక్క పవిత్రస్మృతిని శాశ్వతంగా నిలబెట్టుటకై, స్వామి ఓంకార్ రాత్రింబవళ్లు శ్రమించేవారు.

శాంతి మరియు యథార్థమైన ధ్యానము గురించి స్వామి ఓంకార్ యొక్క సందేశమునకు, దగ్గరలో మరియు దూరంగా ఉన్న ఆయన పాఠకులనుండి వచ్చే స్పందనలో ఆయనకు నిరంతరము కొంగ్రొత్త ప్రేరణ లభించుగాక!

లక్నో, డిసెంబరు 1923 ఆర్. ఎస్. నారాయణ స్వామి

# జ్ఞానేశ్వరీ మాతాజీ ఆశీస్సులు

మహాత్ములను గురించి వ్రాయుట చాలా కష్టము. వారి స్థాయికి వెళ్లినవారే వ్రాయగలరు. అటులనే మహనీయులైన శ్రీరామతీర్థుల గురించి వ్రాయవలయునన్నచో, వారి స్థితికి వెళ్లినవారే వ్రాయగలరు. నా వంటివారు వ్రాయుట సాధ్యము కాదు. కాని, వారి పవిత్రమైన దివ్యజీవితమును తలచినంత మాత్రాన ఏదో తెలియని ఆనందము, ఉత్తేజము కలుగుచుండును. శ్రీ స్వామి రామతీర్థులు జీవితమంతా పవిత్రమైన హిమాలయపర్వతశ్రేణులలో సదా ఓంకారమును స్మరిస్తూ ఆ రమణీయమైన ప్రకృతిని ఆరాధిస్తూ గడిపిరి. వారు ఏ ఆశ్రమమును స్థాపించలేదు గదా! అన్ని ఆశ్రమములు నావే అనెడివారట. వారు ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథములను రచించిరి. అందులో parables of Rama అనే పుస్తకము చిన్న చిన్న కథలతో అందరికీ అర్థమయ్యే విధముగా వేదాంతసారము అంతా నిండి యుండును.

పూజ్య శ్రీ స్వామి ఓంకార్ వారి జీవితమంతా శ్రీ స్వామి రామతీర్థుల ఆశయాలతోనే గడచినది. వారి స్ఫూర్తితోనే శాంతి ఆశ్రమమును స్థాపించుట జరిగినదని ఆయన అనెడివారు. శ్రీ స్వామీజీ చాల సంవత్సరముల క్రిందట ధ్యానము గురించి వ్రాసిన పుస్తకము (Meditation) నకు, శ్రీ స్వామి రామతీర్థుల ప్రత్యక్షశిష్యులైన శ్రీ నారాయణ స్వామి వారు ఉపోద్ఘాతమును వ్రాయుట మాత్రమే గాక, వారు స్వయముగా శాంతి ఆశ్రమమును సందర్శించి, వారి పవిత్రసన్నిధిచే పునీతము జేసిరని వినుటకు సంతోషమయ్యెను.

ఈ పుస్తకము తెలుగు భాషలో కూడ ఉండిన బాగుండునని తలచితిమి. ఈ ధ్యానము పుస్తకము చాల లోతైన భావనలతో కూడియుండును. కావున, ఆ ధ్యానస్థితి తెలిసినవారు మాత్రమే అనువదించగలరు. భగవంతుడు ఎప్పుడు ఎవరి ద్వారా ఏ కార్యమును జరిపించునో, అంతా ఆయన అనుగ్రహమే గదా! ఆయన ఆజ్ఞతో పరమపూజ్యులు శ్రీ స్వామి తత్త్వవిదానంద మా కోరికను మన్నించి అనువదించుటకు సంకల్పించిరి. వారు ఎన్నో అమూల్యమైన వేదాంతగ్రంథములను రచించిరి; అనువాదములను చేసిరి. వారు ఇరవై సంవత్సరముల తరువాత మళ్లా

అనువాదమును చేయుట ఈ పుస్తకమునే అని విన్న తరువాత, వారికి శాంతి ఆశ్రమమునందు, శ్రీ స్వామీ ఓంకార్ నందు ఉన్న ప్రేమాభిమానములు హృదయమును కదలించినవి. వారికి మా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు. ఈ పుస్తకముయొక్క అనువాదములో సంపాదక సహకారమును అందించినవారు బ్రహ్మవిద్యాకుటీర్ కు చెందిన విద్వాంసులు శ్రీ బి. పుష్పాల గారు. వారికి మా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు.

భగవంతుడు అందరినీ సుఖశాంతులతో సదా బ్రోచుగాక!

లోకాస్సమస్తాస్సుఖినో భవంతు.

ఓమ్, శాంతిశ్శాంతిశ్శాంతిః, హరిః ఓమ్.

1-8-2016 జ్ఞానేశ్వరి.

* * * * *

శ్రీగణేశాయ నమః

# శ్రీ శ్రీ శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్ వారిచే రచించబడిన ధ్యానము (తెలుగు అనువాదము)

నా మదిలో ధ్యానమునకు చెందిన కొన్ని భావాలు, కాలముయొక్క పరిధికి లోబడనివి, కదలాడుతున్నాయి. మానవాళిపై సహజప్రేమతో నిండిన నా ఆంతరజీవనము ఆ భావాలకు అక్షరరూపాన్ని ఇమ్మని నన్ను ప్రేరేపించినది. అది అర్ధరాత్రి వేళ. కాని నాకున్న ఒకే తోడు, నా కలం, నా చేతికి ఒదిగి మదిగి ఉండే నా కలం, నా భావాలను లిపిబద్ధం చేయడానికి సంసిద్ధమైనది. నా భావాలు జనుల క్షేమము కొరకు ఉద్దేశించబడినవి. జనులు అంటే సోదరసోదరీమణుల రూపంలో ఉండే ఆత్మస్వరూపులే. వారు దగ్గరగా ఉన్నా, దూరంగా ఉన్నా, ఏదో ఒకనాడు ఈ భావాలను వారు చదివే అవకాశం ఉంది. మంచిది; ఇవిగో ఆ భావాలు ఇవియే; చాలా సరళంగా సంక్షిప్తంగా, వీలైనంత మేరకు అలతి పదాలతో కూర్చబడి ఉన్నాయి.

అధిచేతన (super consciousness) యొక్క పరిధిలోనికి పలాయనము చేయుట (ప్రవేశించుట) యే ధ్యానము అని వర్ణించుట సబబుగానే ఉంటుది. మనస్సు విలీనమయ్యే ఆ చేతనయందు అనుభవము ఇంద్రియములను హద్దులను దాటివేస్తుంది. ఆత్మయొక్క వివరములను గూర్చిన సరియైన వివేకజ్ఞానము ఆత్మయొక్క సర్వాతిశాయి శక్తుల సాహాయ్యము లేకుండా సంభవము కాదు. పరిచ్ఛిన్నములైనవి (ఇంద్రియములు, మనస్సు) తమంత తాముగా అపరిచ్ఛిన్న (అనంత) తత్త్వమును పట్టుకొనుట (విషయముగా చేయుట) అసంభవము. కాని సరియైన విధముగా దరి జేర్చి దశను దిశను సమకూర్చినచో, ఆ పరిచ్ఛిన్నశక్తులు కూడ యోగ్యమైన పరిస్థితుల[1]

---

[1] ధ్యానాదులు; వెదురు బొంగును మురళిగా తీర్చి దిద్దినట్లు.

యందు అనంతము వైపు అభిముఖములై అనంత తత్త్వమునందు విలీనమైనప్పుడు, ఆ పరిచ్ఛిన్నము కూడా ఆధ్యాత్మికశక్తులకు వశమై పరివర్తన చెందుట సంభవమగును. ఇట్టి క్షణములు మనకు ఆ అనంతముయొక్క పొడ (సూచన, చూచాయగా తెలియుట) ను కలిగించుట సంభవమే. నిరంతరముగా సరియైన సంస్కారములతో పరిపుష్టము చేయబడిన పరిచ్ఛిన్నము[1] కూడా మానవుని అనంతము వైపుకు నడింపించ గల్గుతుంది.

పదార్థము మరియు చైతన్యము[2], కాలము మరియు అనంతత్వము[3], దేశము మరియు శూన్యత అనేవి ఒకే సత్యతత్త్వమునకు విభిన్న పరిస్థితులయందలి ద్వంద్వాత్మకమైన[4] పేర్లు మాత్రమే. తెల్లని సూర్యకాంతియే విశ్లేషణ జెంది అనేకములైన రంగులుగా ప్రకటమైనట్లుగా, ఆత్మయే అనేకముగా ప్రకటమై కనబడుతోంది. ప్రాణికోటి ఆ చైతన్యముయొక్క జాగ్రదవస్థ కాగా, నిద్రిస్తున్న చైతన్యమే పదార్థము. కాలము మరియు అనంతత్వము కూడ అటులనే. ఒకటి (కాలము) రెండవదానిని (అనంతతత్త్వమును) సాగదీయుటయే; రెండవదానిని రకరకములుగా ప్రదర్శించుటయే; లేదా రెండవదాని క్రమవికారరూపమైన వికాసమే. ఒకటి (అనంతతత్త్వము) పూర్ణము కాగా, రెండవది (కాలము ఇత్యాది) దాని అవయవము లేక అంశ. కాబట్టి, (ఆ అనంతతత్త్వమునకు) ఈవలి వైపున ఉన్న మనము, ధ్యానమునకు చెందిన ఆలోచనలను ప్రకృతియొక్క ఉపాధి ద్వారా మొదలు పెట్టాలి; మొదలు పెడదాము. మనము ముందుకు సాగుతూ, ఆ చైతన్యముయొక్క, ఆ అనంతముయొక్క, ప్రకాశము మరియు శక్తియొక్క ప్రభావము మన ఆలోచనలపై ఉండేలా జాగ్రత్త పడుతూ ముందుకు సాగాలి. సత్యముయొక్క ఊపిరి మనల్ని ముందుకు నడిపించిననాడు మనము

---

1 మనస్సు ఇత్యాది.

2 దేహము మరియు ఆత్మ

3 కాలము పరిచ్ఛిన్నము, ప్రవాహరూపము కాగా అనంతమైన తత్త్వము కాలమునకు అతీతమైనది.

4 పరస్పరవిరుద్ధములుగా భాసించేవి.

సత్యమునందు ప్రతిష్ఠితులమవుతాము; మనము అనంత-అద్వయ-పరమాత్మయందు ఉన్నామనియు, వాస్తవములో అనంతపరమాత్మయే మన స్వరూపమనియు మనకు తెలుస్తుంది.

ముమ్మొందుగా మనం ధ్యానాన్ని సత్యముతో ఆరంభించాలే గాని, అసత్యముతో ఆరంభించరాదు. సరే, సత్యము ఏది? ఈ ప్రశ్నను మానవుడు సర్వదా లేవనెత్తుతూనే ఉన్నాడు. ఏకత్వము మాత్రమే సత్యము. ద్వైతము (నానాత్వము) అసత్యము మరియు అజ్ఞానము. మీరు అజ్ఞానముతో ఆరంభిస్తే, అజ్ఞానమునందే ముగిస్తారు. అది మిమ్ములను అంతకంటె ముందుకు కొనిపోలేదు, కొనిపోదు. కాబట్టి మీరు మీ ధ్యానాన్ని ఏకత్వము అనే సత్యముతో ఆరంభిస్తే, మీరు దానిని ఏకత్వముయొక్క సత్యముతోనే ముగిస్తారు. సత్యవస్తువు ఎన్నటికీ మారేది కాదు, అవికారి, కాని వికాసోన్ముఖము. అది సర్వదా కొంగ్రొత్తగా ప్రకటమౌతూ, సర్వదా ఉదయిస్తూ ఉంటుంది. అది మిమ్ము హద్దులు లేని సౌందర్యము మరియు వినూత్నత్వముతో నిండిన దారులగుండా ముందుకు కొనిపోతుంది. ఇంకో మాటలో చెప్పాలంటే, సత్యముపై సత్యము, దానిపై సత్యము ఈ విధంగా సత్యముయొక్క పై పై స్థాయిలలోనికి కొనిపోతుంది. ఈ విధముగా సత్యమార్గము మిమ్ము కొత్త కొత్త ఉన్నతోన్నతమైన సామ్రాజ్యాలలోకి తీసుకుపోతుంది. దీనికి విరుద్ధముగా, అసత్యముతో మొదలిడినప్పుడు, మీరు ఎన్నటికైననూ ఉన్నతిని, వికాసమును పొందలేరు. ఎందుకంటే, వ్యక్తులకు మరియు దేశములకు అసత్యము మరియు అజ్ఞానము వాటి వెంబడి వేర్పాటుదనమును, తిరోగమనమును మాత్రమే కలిగించ గల్గుతాయి, కలిగిస్తాయి. అది సత్య-అసత్యముల సిద్ధాంతము. నీ దృష్టి ఏకాగ్రము, లక్ష్యశుద్ధి గలది కావాలి. నీ దృష్టిని ఒకదానిపైన నిలుపుము; ద్వైధీభావమును వీడుము. రెండింటిపైకి ప్రసరించే దృష్టి దోషముతో కూడిన దృష్టి. అట్టివారికి ఒకే ఒక వస్తువు సర్వదా రెండుగా కనబడుతుంది. ఇట్టి దోషములను జనులు చికిత్స[1]తో సరి చేసుకోవాలి. నీ చూపు లేక దృష్టి ఏకాగ్రముగా ఉండాలి. అప్పుడు నీకు దేహము అంతా,

---

[1] శాస్త్ర శ్రవణము

లేదా దేహావయవములు, ఒక వెలుగు[1]తో తొణికిసలాడుతూ ఉంటాయి. ఆ పైన నీ దృష్టిని ఏదైననూ ఆటంకపరచలేదు, భ్రమను కలిగించలేదు, ద్వైధీభావమును కలిగించలేదు. నీయందు ద్వైతముయొక్క చీకటి, లేదా నీడ, ఉండనే ఉండదు.

ప్రారంభమునుండి నీ దృక్పథమును సరిదిద్దుకో. తరువాత, అంటే సత్యముయొక్క దృష్టిని -- ఏకత్వమునందు ఏకాగ్రమైన దృష్టిని -- నిలిపిన పిదప, సుఖకరమైన ఆసనమును ఏదో ఒకదానిని ఎంచుకొనుము. ఆ ఆసనము ఎల్లా ఉండాలంటే, నీవు చాల సేపు అలసట గాని, దేహదృష్టి గాని లేకుండా, కూర్చుండగలగాలి. ఫలానా ఆసనము అనే నియమము లేదు. కుర్చీకి చేర్లబడి కూర్చుండవచ్చును, లేక చేతులను కాళ్లను చాపి కూర్చుండవచ్చును, లేదా వెల్లకిలా పరుండవచ్చును కూడా. దేహాభిమానమును పూర్తిగా విస్మరించగలిగితే చాలు. అప్పుడు మనస్సులోని బరువు బాధ్యతలనన్నింటినీ విడిచిపెట్టి, మనస్సును పూర్తిగా శాంతముగా విశ్రాంతిగా ఉండనిమ్ము. ఆలోచనలయందు తగుల్కొనకుండా, ఆలోచించే ప్రయత్నమును ఏమీ చేయకుండా, మనస్సు శాంతమై కుదురుగా ఉండునట్లు చూచుకో. ఇప్పుడు నిన్ను నీవే, నేను యెవరు? నేను అద్వయ (రెండవది లేని) ఏకైక సత్యతత్త్వమునా? అని ప్రశ్నించుకొనుము. నీవు విభజించ శక్యము కాని ఏకైక దైవతత్త్వము అనే విషయంలో నీ హృదయంలోనికి శంక ఏదైనా ప్రవేశిస్తూనే, శివోఽహమ్! శివోఽహమ్! శివోఽహమ్ అని జపించుము. నిస్సందేహముగా నేనే శివుడను అని ఆ మాటకు అర్థము. అహం బ్రహ్మాస్మి, నేను పరబ్రహ్మనై ఉన్నాను, నిశ్చయముగా పరబ్రహ్మను నేనే, రెండవది లేని ఏకైక దైవతత్త్వము నేనే, అనే వేదముయొక్క చాల గొప్ప మహావాక్యమును కూడ గుర్తు చేసుకొనుము.

దేవుడు బయటనుండి, లేదా కొంత దూరమునుండి, ధ్యానము ద్వారా మనకు దర్శనమిస్తాడని తలపోయుట అజ్ఞానము. ధ్యానము ద్వారా మనము దైవత్వంలోనికి మారిపోతాము అని తలపోయుట కూడ

---

[1] సత్యమును పసిగట్టే సత్త్వగుణము

అజ్ఞానమే. అటువంటిది ఏదీ లేదు! ఇప్పటికే నీవు అదియే[1] అయి ఉన్నావు. మనము అనంతకాలమునుండి ఆ దైవతత్త్వమే అయి ఉన్నాము. ఆ దైవము ఒక్కటి; సర్వము అగు ఆత్మ ఆ దైవమే; సర్వకాలములయందు సర్వమును వ్యాపించి సర్వమునకు అంతర్యామియై ఉన్నది ఆ దైవమే. మనము అనాదినుండియు ఆ బ్రహ్మయే, దైవత్వమే, అయి ఉన్నాము. ఏకత్వము అనే సత్యము ఎన్నటికీ చెదిరిపోరాదు. మనము దేహమే నేను అనుకుని గందరగోళంగా ఏడుస్తూ ఆ సత్యమునుండి విముఖులము కారాదు. మీ మనస్సులలో దృఢమైన నిశ్చయమును చేసుకోండి; శాశ్వతకాలము ఉండేట్లా సందేహము లేకుండా ప్రతిష్ఠించుకోండి. ఈ విధముగా కొంత కాలము దేవుని ఉనికిని అభ్యాసము చేయండి.

ఇక ఇప్పుడు, ధ్యానము వలన సిద్ధించే వస్తువు లేక ప్రయోజనము ఈ లోకంలో ఏమి ఉన్నది? మనము ధ్యానము వలన ఇప్పుడు సాధించేది లేదా పొందగలిగేది ఏదైనా ఉన్నదా? లేదు, సుతరాము లేదు. మనమే దైవస్వరూపులమై ఉండగా, ఆ సత్యము మనకు తెలుస్తూ ఉంటే, ఇంతగా ధ్యానము చేయవలసిన అక్కరయే లేదు. మనము ధ్యానము చేసేది ఆ చేతనను కోల్పోకుండా స్థిరముగా నిలబెట్టుకొనుట కొరకు మాత్రమే; దాని వలన మనము సర్వకాలములయందు ఏ దైవమై ఉన్నామో, ఆ దైవస్వరూపులముగనే ఉండగల్గుతాము; మనము ఏది కామో అది అవకుండా ఉండగల్గుతాము. మనము దైవమును పొందుటకు గాని, లేదా దైవము అగుటకు గాని, ధ్యానమును చేయుట లేదు సుమా! ధ్యానమునకు ప్రయోజనము అది ఎన్నటికీ కాదు! అదే ధ్యానమైతే దాని వలన మనము మన స్వరూపమునుండి, మనము దైవస్వరూపములో అంతర్గతులము అనే సత్యమునుండి, ఏకత్వము[2] అనే సత్యమునుండి, చాల దూరము లాగివేయబడతాము; మన ఏకాగ్రత సత్యదూరమై పోతుంది. మనము ఇప్పుడే మన స్వరూపమునందు రెండవది లేని ఆ ఏకసత్యమై

---

[1] ఆ పరమాత్మయే

[2] జీవేశ్వరుల ఐక్యము.

ఉన్నాము. ఏది ఉన్నదో, అది ఒక్కటియే! అది నీవే అయి ఉన్నావు! తత్ త్వమ్ అసి! అదియే ఇది[1]! ఇది జీవనసిద్ధాంతము, ఇది సద్వస్తువుయొక్క సిద్ధాంతము. కాబట్టి, ధ్యానమునందు కూడా నీ దృష్టిని దానికి దూరము కానియ్యకుము. అట్లు చేసినచో, ధ్యానముయొక్క ప్రయోజనమే పరాస్తమగును.

కాబట్టి ధ్యానము ద్వారా ఏదో ఒక కొత్తదానిని పొందాలనే ఆదుర్దా నీకు వద్దు; కొత్త దేవుడిని అయినా పొందాలి అనే ఆదుర్దా వద్దే వద్దు. కాని ఒక సంగతిని మాత్రం మరువవద్దు. నీవు ఇప్పటికే ఏది అయి ఉన్నావో, అది విస్మృతికి రాకుండా, ఆ సత్యము దూరము కాకుండా, జాగ్రత్త పడాలి. నిత్యసత్యము, అఖండము, అఖండ్యము అగు పరమాత్మ, నీవు అనాదికాలమునుండి ఒక్కటియే అనే సనాతనమైన (నిత్యమైన) సత్యమునకు నీవు దూరము కారాదు. అతిప్రాచీనదినము (కాలము) కూడ నీవే అయి ఉన్నావు. అనంతమునుండి అనంతము వరకు, నీవు అదియే అగుచున్నావు! నీవు దైవమే అగుచున్నావు! ఈ సత్యముపై వాదవివాదములకు గాని, విరోధమునకు గాని తావు లేదు. ఇది ఎన్నటికీ మార్చ శక్యము కాని, చెక్కు చెదరని శాశ్వతసత్యము. నిన్న, నేడు, రేపు కూడా, శాశ్వతకాలము నీవు సముడవే (మార్పు లేని సత్యమే) అయి ఉన్నావు. నీవు ఎన్నడునూ పుట్టలేదు; కాని నీవు సర్వదా పుడుతూ ఉండే నిత్యనూతనమైన అనంతత్వముయొక్క సంతానమవు. నీకు పెద్ద వయస్సు అనేది ఎన్నడూ లేదు. అతిప్రాచీనదినము (కాలము) నీవే అయినప్పటికీ, నీవు సర్వదా నిత్యనూతనమైన యౌవనము గలవాడవు. నీవు ఎన్నడునూ మరణించవు; నీవు మరింత శాశ్వతముగా జీవిస్తూ, మరింత జీవింపజేస్తూ ఉంటావు. పుట్టుక-గిట్టుట అని వర్ణించబడేవాటికి నీపై ఎట్టి ప్రభావము లేదు. అవి జీవితమనే నాటకంలో మారిపోతూ ఉండే దృశ్యములలో వచ్చిన ఘట్టములు మాత్రమే. నీవు ప్రతిరోజు దుస్తులను వేసుకుని విప్పినట్లే దేహములు పుట్టి గిట్టుతూ ఉంటాయి. దుస్తులు పాతవి అయి, రంగు మారిపోయి, చినిగిపోతాయి. వాటి స్థానంలో కొత్త దుస్తులు

---

[1] ఈ ఆత్మ.

నిరంతరంగా ఎప్పటికీ వస్తూ ఉంటాయి. దేహములు పుట్టుట, గిట్టుట కూడ అటులనే అంతము లేకుండా సాగిపోతూ ఉంటాయి. కాని, నీవు మాత్రము ఎప్పుడూ ఒకే విధముగా, నిత్యనూతనంగా ఉంటావు. అంతే కాదు. నీవు అవికారివి! లోకము, అంటే కనబడేది, మారుతూ ఉంటుంది. నీవు కంటికి కానరాకుండా లోపల ఉంటావు! నీ దేహములు లోకమునకు చెందినవి, అనిత్యములు. కాబట్టి అవి సహజంగానే లోకముయొక్క పరిస్థితులకు లోబడి మారిపోతూ ఉంటాయి. కాని, అదంతా నీవు కాదు. నీవు ప్రపంచమునకు, నీ దేహములకు కూడ అతీతముగా, వాటినుండి విముక్తుడవై ఉన్నావు. కాబట్టి, ఈ సత్యమునకు తగ్గట్లుగా, నీ దైవవిభూతిని నీ అనుభవమునకు తెచ్చుకో. లోకమునకు, దేహమునకు, అంతే కాదు, దేశకాలములకు కూడ, అతీతముగా పైకి లెమ్ము.

నీవు నీ జన్మహక్కును, నీదైన దైవత్వమును, అద్వయ-సత్యముతో నీ ఏకత్వమును, క్షణకాలమైననూ మరువవద్దు; నీవు పని చేస్తూ ఉన్నా, విశ్రమిస్తూ ఉన్నా, మరువవద్దు. నీవు ప్రపంచమునకు చెందిన వివిధకర్తవ్యములయందు లోతుగా నిమగ్నమై వ్యగ్రుడవై ఉన్నప్పటికీ నీ దైవత్వమును మరువవద్దు. ప్రాపంచిక చింతలు, బెంగలలో తగుల్కొని నీ దైవత్వమును మరువవద్దు. లేదా ప్రపంచముయొక్క భోగమునకు చెందిన ఆకర్షణలలో పడి నీ దైవత్వమును మరువవద్దు. నీవు నీ చుట్టూ ఉన్న పరిస్థితులయందు తగుల్కొని లేవు. నీవు పూర్తిగా అసంగుడవు. బాధ్యతలు, కర్తవ్యములు, ఋణములు[1] అని వర్ణించబడేవి నీకు లేవు. దానధర్మాలు చేయాలి అనే బరువు లేదా బాధ్యత కూడా నీకు లేదు. నీవు స్వతంత్రుడవు. ఈ సత్యమును **అంతరంగపు లోతులలో తెలుసుకొని (అనుభవమును తెచ్చుకొని) వర్తిల్లుట** లేదా **ఉండుట** మాత్రమే నీ ఏకైక కర్తవ్యము. సర్వకాలములయందు, సర్వవిషయములయందు మరియు సకలపరిస్థితులయందు ఆత్మనిష్ఠను నిలబెట్టుకొనుటయే నీ కర్తవ్యము. మీరు మీ స్వరూపములో ప్రవేశించుడు; స్వరూపములో నిలిచియుండుట మరీ మంచిది. మీ స్వరూపమునకు తగ్గట్లుగా ప్రవర్తించుడు;

[1] ఋషి-దేవ-పితృ ఋణములు.

స్వరూపమునకు దూరము కావద్దు. మీరు స్వరూపమునకు బయట కేంద్రితులు కావద్దు[1]. రెండవది లేని ఏకైక సత్యమునందు (చే) మీ జీవాత్మలు ఆవేశించబడునట్లు చేయుడు. కాబట్టి నేను చెప్పేదేమంటే, మీ ఏకైక కర్తవ్యము అది మాత్రమే. అది యైననూ మీ మీద ఉన్న బాధ్యత అని చెప్ప వీలు లేదు. అది కేవలము మీకు ఉన్న స్వాతంత్ర్యము మరియు జన్మహక్కులకు చెందిన స్వేచ్ఛతో కూడిన అధికారము మరియు ఆనందము మాత్రమే. మిగిలిన పనులు అన్నీ కేవలము కాలమును గడుపుటకు ఉద్దేశించినవి మాత్రమే. అవి అప్రధానములు. అవి కేవలము మీకు సేవ చేసే బానిసలు, కేవలము ఉపకరణములు మాత్రమే, లేదా మీ ఆత్మసాక్షాత్కారానికి సహకారి సాధనములు కూడ కావచ్చును[2]. మీరు ఈ లోకములో ఉన్నది, ఇతరముపై ఏ విధమైన పరాధీనత లేకుండా, ఇటువంటి పవిత్రమైన చేతనయొక్క పూర్ణత్వమును ఆనందించుటకు మాత్రమే. మీరు ఈ లోకమునందు ఉన్నది దేహముయొక్క లేక ఇంద్రియముల స్పృహ[3]తో విషయములను భోగించుటకు కాదు. ఏ క్షణమునందైతే మీరు దేహముయొక్క స్పృహ (దేహాభిమానము) తో సంతోషపడుతూ, చుట్టూ ఉండే పరిస్థితుల (భోగ్యముల) తో ఇంద్రియములను తృప్తి పరుస్తూ ఉంటారో, అదే క్షణమునందు మీరు మానవులు కాకుండా పోతారు. అది పశువుల స్థాయికి, లేదా క్రిమికీటకాదుల స్థాయికి జారిపోవుటయే అగును.

అదృష్టం మంచిది అగుట వలన, దేహమునందు లేదా దాని చుట్టూ ఉండే వాటియెడల తాదాత్మ్యముతో జీవించే సందర్భంలో మీరు ఎన్నటికీ విశ్రాంతిగా ఉండలేరు. ఇక్కడ ఈ దేహమునందు అభిమానముతో జీవిస్తూ ఉండే నీవు సర్వదా, ఒక రకమైన అసంతృప్తితో, ఏదో వెలితి భావనతో, ఇంకెక్కడో బాగుంటుంది అనే అశాంతితో, జీవిస్తూ ఉంటావు[4]. నీ స్వంత

---

[1] బహిర్ముఖులు కావద్దు.

[2] కర్మయోగము

[3] తాదాత్మ్యము

[4] homesick

ఇల్లు (స్వరూపము) దేహానికి బయట ఎక్కడో ఉంది అనే అనుభవం నీకు కలుగుతూ ఉంటుంది. ఈ దేహమునందు నీకు ఆనందము లభించదు. ఆనందము మరెక్కడో లభించుననే భావన నీకు కలుగుతూ ఉంటుంది. ఈ దేహముతో అంటిపెట్టుకుని ఉన్నందుకు నీకు దుఃఖమే కలుగుతూ ఉంటుంది. సకలభోగ్యములు, సౌకర్యములు, చుట్టూ ఉండే పరిస్థితులలో చేసుకున్న చిన్న-పెద్ద మార్పులు కూడ నీకు ఉన్నదానికంటె కొంచెమైనా అధికంగా ఆనందాన్ని కలిగించలేవు. నిజం చెప్పాలంటే, ఈ దుఃఖము (ఇబ్బంది), లేదా స్వంత ఇంట్లో (స్వస్వరూపమునందు) లేను అనే ఈ వెత (దుఃఖము) నీ స్వరూపమును సూచించే హితకరమైన సూచనలే అనుటలో సందియము లేదు. నీ ఉనికియొక్క కేంద్రము నీ ఆంతరస్వరూపమునుండి దూరమగుట వలన, నీవు ఉండవలసిన దానియందు లేనా యేమి? అనే అనుభవమును, ఉండవలసిన తీరున లేనా? అనే అనుభవమును పొందుట సహజమే. అది, బురదలో పడిన గొర్రె వలె, నీ ఆత్మ చేస్తున్న చాల మంచి ఫిర్యాదు, గట్టి నిరసన. నీవు ఆ విధముగా పశుప్రవృత్తితో జత గట్టకుము. బురదలో పంది వలె, దేహము మరియు దాని పరిసరములతో తాదాత్మ్యమును చెంది (మైమరచి) ఉండకుము. పశువునకు తన స్వభావములో మార్పు అనే చిన్ని సూచనయైననూ చాల ఇబ్బందిని కలిగిస్తుంది. అట్టి పరివర్తనము కావాలి అనే ఆకాంక్ష గాని, దాని గురించి కల్పనయైననూ, దాని అవగాహనయైననూ పశువునకు ఉండదు. కాని, ఆ విధముగా దేహతాదాత్మ్యముతో మైమరచి యుండుట నాకు చాల అసమంజసంగా భాసిస్తుంది, మూలం నుండి దూరమైన భావన కలుగుతుంది. నీటినుండి బైట పడేసిన చేపకు వలె, ఆకాశమునందు ఎగిరే శక్తిని కోల్పోయిన పక్షికి వలె, చాలా ఇబ్బందిగా ఉంటుంది. పశువు తన పశుప్రవృత్తికి అతీతంగా ఎదగదు. అది పశుజీవితంతో, పశుపరిసరాలతో సంతృప్తి జెందుతూ బ్రతికేస్తుంది. ఆ పశువు, ఏదీ అడ్డు రాకుండా ఉన్నంత వరకు, ఆ సందర్భంలో లభించినంతవరకు, పశుస్వభావమునకు చెందిన భోగములను కులాసాయైన ధోరణితో, తన శక్తికి మరియు అంతఃప్రేరణకు తగినంత మేరకు, నిండా అనుభవిస్తుంది. బాధ్యతలు, లేదా

దుష్పరిణామములు అనువాటి చింత లేకుండా అది కేవలము ఒక పశువు వలె ప్రవర్తిల్లుతుంది. అంతే కాదు. దానికి బంధము గాని, నీతినియమముల ఆదేశము గాని, శిష్టాచారము గాని, మనుష్యులు అనుకునే ధర్మము-న్యాయము గాని ఏదీ ఉండదు. అది ఒక పశువుగా తనదైన జీవితమును సుఖంగా జీవిస్తూ ఉంటుంది. ఓ మానవుడా! పశువులోని దైవాంశ అంతే[1]. నీకు నచ్చితే దానినుండి గుణపాఠమును నేర్చుకో; నీ స్వరూపమునకు అనురూపముగా జీవించే ప్రయత్నం చేయుము. నీవు దేవుడవు, నీవు స్వతంత్రుడవు; కావున నీవు దేవుడు వలె సర్వదా స్వతంత్రుడవై జీవించాలి కూడా. కాబట్టి, ఓ ప్రియులారా! నేను దేహము అనే భావన (దేహాభిమానము) తో, లేక దేహాభిమానమునందు, ఒక్క క్షణమునైననూ వృథా చేయకుడు. సర్వకాలములయందు నేను దైవస్వరూపుడను అనే అనుభూతిని పొందుడు. మరియు ఆ అనుభూతి నిరంతరముగా ఉండే విధముగా ప్రయత్నించుడు.

అజాగ్రత్త వలన గాని, సోమరిదనము వలన గాని, నీవు నీ దైవత్వమును క్షణకాలమైననూ విస్మరించుట సంభవించినచో, నిత్యనిరంతర దైవత్వచైతన్యము[2] అనే లక్ష్యమునుండి విలోమనిష్పత్తిలో చాల దూరము, మరింత దూరము, లాగివేయబడతావు. నీ అజాగ్రత్త వలన లక్ష్యమునుండి దూరమైన (లక్ష్యమును చేరలేకపోయిన) క్షణములు బహుశా నిముషములు లోనికి సాగవచ్చును. నీవు నీ దైవత్వ చైతన్యమునుండి దూరమై వ్యర్థము కానిచ్చిన నిముషము నీవు గంట వరకు సత్యమునుండి దూరము అయ్యేట్లా చేయును. దైవత్వ చైతన్యము యెడల జాగరూకత లేకుండా గడచిన సోమరిదనపు గంటలు నిన్ను కొన్ని రోజుల వరకు లక్ష్యమునుండి దూరము చేయును. రోజులు వారములలోనికి, వారములు నెలలలోనికి, నెలలు సంవత్సరములలోనికి నిశ్చితముగా సాగిపోతూ ఉంటాయని వేరే చెప్పనక్కరలేదు. ఈ విధముగా మిక్కిలి విలువైన జీవితము అంతా

---

[1] ఆ దైవత్వమే విస్తరిల్లి మానవుడు పుట్టినాడు.

[2] God-consciousness

వ్యర్థముగా గడిచిపోయే అవకాశము ఎంతేని గలదు. నీవు ఏ విత్తును నాటుతావో, పది రెట్లు దాని పళ్లే నీకు లభిస్తాయి. అది ప్రకృతినియమము. చేసే పని మంచి అయినా, చెడు అయినా, పరిణామములు అనంతముగా విలోమనిష్పత్తిలో వృద్ధి జెంది లభిస్తాయి. ఇది ప్రకృతినియమము.

ఈ విధముగా మీరు అంతము లేకుండా తిరుగుతూ జననమరణముల చక్రాన్ని త్రిప్పడం ఆరంభించి కొనసాగిస్తారు. బహుశా ఇంకో జన్మ లభిస్తుందేమో! అని అంటారేమో! ఆ జన్మ అక్కడితో అంతమౌతుందా? ఆ జన్మయందు జీవితలక్ష్యాన్ని చేరుకోకపోతే, ఆ జన్మ అక్కడితో ఎల్లా అంతమౌతుంది? ఈ విధముగా మనము పట్టించుకోకుండా వదిలేసిన కొద్ది క్షణముల అజాగ్రత్త వలన, మీరు మృత్యువునుండి జన్మలోనికి, మరల జన్మనుండి మృత్యువులోనికి, ఒకసారి రెండు సార్లు కాదు, చెప్పలేనన్ని సార్లు, సంసరిస్తూ ఉంటారు. ఈ సందర్భంలో స్వామి రామతీర్థయొక్క పవిత్రమైన పలుకులను మనం స్మరించినట్లైతే, చాలా బాగుంటుంది:

నిద్రనెరుగని సముద్రములో అలలు యెన్నో
శ్వాసల పుట్టుకలు అన్ని.

కాలప్రవాహంలో జీవునకు ఇన్ని జన్మలు, లెక్కలేనన్ని జన్మలు, నిరంతరముగా అనుగ్రహించబడుట చాల విడ్డూరమైన విషయము. ఇంతవరకు మనలోని ప్రతి ఒక్కరు ఎన్ని జన్మలను పొంది ఉంటామో అని ఊహిస్తేనే ఆశ్చర్యం కలుగుతోంది. ఇంతే గాక, మనకోసం భవిష్యత్తులో ఇంకా ఎన్ని జన్మలు వేచి ఉన్నాయో! ఈ జననమరణచక్రమునుండి బయట పడే మార్గము లేదా? ప్రతి యుగమునందు సాధుసంతులు, మహర్షులయొక్క బోధలు వ్యర్థమైన గోలయేనా? ప్రతియుగమునందలి అవతారమూర్తుల ప్రయత్నములు వ్యర్థమేనా? వారి ధైర్యసాహసములు కొరగానివేనా? ప్రతి యుగమునందు ప్రతి ప్రాంతమునందలి సాధుసంతులు, మహర్షుల సిద్ధాంతవచనములు నిస్సారమైన కల్పనలేనా? మోసపూరితమైన బడాయి కబుర్లేనా? ఆ బోధలు మతం మత్తులో పలికిన పలాయనవాదములా? లేక అవి ఆత్మయొక్క

పరాజయములా? జీవితములోని సవాళ్ల ముందు లొంగిపోయే మాటలా? కాదు, కానే కాదు. అట్టి దృఢసంకల్పులైన మహాత్ములు అట్టి బోధల వలన పొందే ప్రయోజనము గాని, సంతృప్తి గాని ఏమీ లేదు. కాబట్టి నిశ్చితముగా ఒక మార్గము గలదు, తప్పక దరి జేర్చే మార్గము గలదు, చిరకాలమునుండి మానవుడు అన్వేషిస్తున్న మార్గము గలదు, తరచుగా మహాత్ములు నడచిన అట్టి దారి గలదు, యథార్థముగా విజయమునిచ్చే మార్గము గలదు.

అలసి సొలసి తిరుగాడుచున్న బాటసారులారా! నా వద్దకు రండు! **ఒకే ఒక మార్గము గలదు. ఆ మార్గము నేనే.** మీ జీవాత్మల భారమును నాపై మోపుడు. నన్ను ఆశ్రయించుడు. నా యోగమును చేపట్టుడు. అది సరళమైనది. నన్ను అనుసరించుడు. నన్ను కనుగొన్నవాడు శాశ్వతముగా సత్యప్రకాశమునందు ఉండగలడు. అసత్యముయొక్క చీకటినుండి, ద్వైతమునుండి, అజ్ఞానమునుండి ఆతడు విముక్తుడగును. ఆతడు ఎన్నడూ మరణించడు, ఆతనికి మరల పుట్టుక లేదు. ఆతడు శాశ్వత కాలము మార్పు లేనివాడు! ఆతడు కాలముయొక్క మృత్యువునుండి శాశ్వతజీవనములోనికి ప్రవేశించినాడు. ఇక ఆతనిపై మృత్యువుయొక్క అధికారము ఉండబోదు. కాబట్టి, నేను అదియే అయి ఉన్నాను; నేను మార్గమునై, సత్యమునై, జీవనమునై ఉన్నాను, అని తెలుసుకో! అన్ని మార్గములు మరియు ప్రతి మతము ఈ సత్యము వైపే చూపిస్తోంది. అదంతా ఎన్నటికీ అసత్యము కాజాలదు. ఈ సత్యమును చూచి చెప్పిన వారందరు తప్పు ప్రయోజనముల కొరకై చెప్పియుండుట అసంభవము. అట్టి ఊహ సత్యదూరము.

ఇకపోతే, స్వాతంత్ర్యము (విముక్తి) నకు మార్గము నీ కంటికి యెదురుగా నిలిచి లేదా?[1] ఆ విముక్తిని పొందుట చాల దూరములోనైతే లేదు అని నీకు ఇప్పుడు స్పష్టముగా తెలియుట లేదా? ఆ మార్గము చిన్నది మరియు సరళమైనది. ఆ మార్గము నీ ఇంటి ద్వారము వద్ద గలదు; అంతే కాదు, ఇంటిలోపల కూడ ఉన్నది, నీ లోపలనే గలదు. నీవు

---

[1] విముక్తిమార్గము నీ కళ్లలోనికి తేరిపార చూచుట లేదా యేమి?

పెద్ద దూరము పయనించనక్కర లేదు, నీవు ఆ మార్గమును చేరుటకై పెద్ద తీర్థయాత్రను చేపట్టనక్కర లేదు. ఆ మార్గము కొరకై నీవు ఏదో ఒక విగ్రహము చుట్టూ లేదా దేవాలయము చుట్టూ లేదా పవిత్రమైన చెట్టు చుట్టూ సాంప్రదాయిక పవిత్ర ప్రదక్షిణములను చేయ బని లేదు. దాని కొరకై నీవు పవిత్రజలములను స్పృశించవలసిన పని కూడ లేదు[1]; లేదా దాని కొరకై పావనము చేయబడిన ఇతర-అంశములను వినియోగించనక్కరలేదు[2]. మీరు వ్రతములను చేపట్టనక్కరలేదు, లేదా కొంతకాలము బ్రహ్మచర్యమును పాటించుట ఇత్యాదులు ఆవశ్యకము కాదు, లేదా కఠినమైన నియమములను పాలించనక్కరలేదు. నీవు వెనువెంటనే, ఇప్పుడు, నీవు నిలిచియున్న చోటనే, దేహాభిమానము (శరీరస్పృహ) నుండి విముక్తుడవైన చాలును. ఇది కేవలము ఒక క్షణములో చేయగలిగే పని. దాని కొరకై నీవు రెండవ క్షణమును వ్యర్థము చేయవలసిన పని లేదు. దీని కొరకై ఇంకో వ్యక్తి నీకు సంరక్షకుడు (పోషకుడు) కానక్కరలేదు, ఇంకో వ్యక్తియొక్క ఆదేశము లేక ఉపదేశము లేక సాహాయ్యము ఆవశ్యకము కాదు, లేదా పూజలను ప్రార్థనలను చేసి సంపాదించిన పుణ్యము ఆవశ్యకము కాదు, లేదా ఒక విశిష్టమైన పూజ లేక యాగము ఆవశ్యకము కాదు, అగ్నియందు హోమము మొదలైన భూతసంస్కారము ఆవశ్యకము కాదు, లేదా నీవు అట్టి గొప్ప కార్యము కొరకు నడుము బిగించనక్కర లేదు. నీవు నీదైన మంచి సంస్కారముతో ఆ పనిని (దేహాభిమానమును వీడుటను) చేయాలి, నీవు చేయగలవు.

కావున, నీయందలి దైవత్వముయొక్క స్పృహయందు నీ శ్వాసను సాగనిమ్ము, అట్టి స్పృహ లేకుండా ఒక్క క్షణమైననూ గాలి పీల్చకుము. నీకు తెలిసినా తెలియకపోయినా, ఇప్పటికే నీవు అదియే (పరమాత్మయే) అయి ఉన్నావు అని తెలుసుకొనుము. నీవు అట్లు చేసినచో, నీవు ఉద్దేశపూర్వకంగా విముక్తియొక్క మార్గమునందు ఉండెదవు. నీవు

---

[1] పవిత్రస్నానములను చేసే పని లేదని వేరుగా చెప్పవలయునా?

[2] హోమములను చేయుట, భూమిపూజ ఇత్యాది పవిత్రకర్మలు ఆవశ్యకము కాదని రచయిత అభిప్రాయము కావచ్చును.

విముక్తుడవు. నీవు ఆనందస్వరూపుడవు. మోక్షమందిరముయొక్క ద్వారము వద్దనుండి నీవు ఇప్పటికే సాక్షాత్తు ఆత్మదేవుని సన్నిధి (ఆత్మదేవుని స్ప్రుహ) లోనికి ప్రవేశపెట్టబడినావు. ఇప్పుడు నీవు ఆంతరతమమైన పవిత్రస్థానము (గర్భగుడి) లోపల నిలిచియున్నావు. ఇప్పుడు నీవు పూజారివి, పూజాద్రవ్యము కూడ నీవే, మరియు సర్వాధ్యక్షుని (అధిష్ఠాన) సన్నిధివి కూడ నీవే. పూజ చేసేవాడవు నీవే, పూజించబడే దేవుడు నీవే; పావనము చేయబడినవాడవు నీవే, పావనము చేయువాడవు కూడ నీవే. సర్వము నీవే. ఇప్పుడు నీవు ఆ ఆనందమును గురించి అబ్బురపడుతూ సంభ్రమాశ్చర్యములతో, అతిశయించిన ఆదరముతో సరళంగా (ఈ విధంగా) గుసగుసలాడుకుంటావు: ఆహా! అది సాక్షాత్తుగా భగవానుని సన్నిధి. ఆయన తన పవిత్రమందిరమునందు ఉండెను. కాని ఇదివరలో నాకు తెలియకుండెను. చుప్! చుప్! ఓయీ! పవిత్రతయొక్క ఏకాంతమునందు నీ నిత్యసన్నిధికి జయమగుగాక!

ఇప్పుడు నీకు **అది నీవే** అని తెలిసినది. నిద్రిస్తున్నా, తెలివిగా ఉన్నా, నీవు సర్వదా సాక్షాత్తుగా ఆ దైవత్వమే అని తెలిసినది. నీవు కేవలము, సర్వదా భగవత్స్వరూపుడవే అనే సత్యజ్ఞానములోనికి నిద్ర లేస్తావు. నీవు సంతృప్తుడవౌతావు; నీవు చప్పుడు లేకుండా అయిపోతావు; నిశ్శబ్దంలో కలిసిపోతావు: ఆహా! నీలో ఒకడినై మేల్కొంచినప్పుడు నేను సంతృప్తుడనౌతాను! నేను నీవే అని తెలుసుకున్నప్పుడు, ఆహా! ఆ జ్ఞానమునందు ఏమి ఆనందము! ఆహా! అది ఎంతటి ఉజ్జ్వలమైనదో! దాని యానందము! ఆహా!

ప్రియమిత్రులారా! అది భయమును గొల్పే కల కానే కాదు, పగటి కల కూడ కాదు, మహిమాన్వితమైన దర్శనము (అనుభవము) కూడా కాదు. అది పట్టపగలు వెలుగులో ప్రకాశించే సత్యము, పూర్తిగా మేల్కొంచి ఉన్నప్పటి అనుభవము. ఈ ఏకైకసత్యమునకు అభిముఖముగా కళ్లు మూసుకుపోయిన ఇంకో క్షణము, శ్వాస నీనుండి బయల్వెడలకుండు గాక! ఇదే క్షణమునందు నీయందలి దైవత్వమును అనుభవమునకు తెచ్చుకొనుటకై మేల్కొంచుము! అదియే మార్గము.

సకలప్రార్థనలు, సకలపూజలు, సకలవ్రతములు మరియు సకల **యోగములు** లేదా సకల **సాధనలు** (ఆధ్యాత్మిక అభ్యాసములు మరియు అనుశాసనము), ఏదైనా, కేవలము ఈ భావనను మేల్కొలిపి, నియంత్రించి, నిలబెట్టుటకు మాత్రమే విధించబడినవి. దారి తప్పకుండా, ఈ దేహమునందు మరియు ప్రపంచమునందు ఈ అల్పమైన జీవితమునందు శక్తిని మరియు కాలమును వ్యర్థము చేయకుండా, దైవత్వ స్పృహయొక్క ఆనందమును అనుభవించుట కొరకు మాత్రమే ఇవి అన్నీ ఉద్దేశించబడినవి. ప్రతి వ్యక్తి ఈ సాధనలను తన స్థితిగతులకు, అవసరాలకు తగ్గట్లుగా అన్వయించుకొని సరియైన రీతిలో నిర్వహిస్తే, అవి అన్నీ ఒక లక్ష్యమును చేరుకొనే సాధనములుగా ఉపకరించవచ్చును. కాని, అవి ఎన్నటికీ తమంత తాము లక్ష్యములు కావు, లక్ష్యములుగా ఉద్దేశించబడలేదు. మనల్ని శరీరస్పృహ (దేహాభిమానము) నుండి విముక్తిని కలిగించి దైవత్వస్పృహలోనికి మేల్కొలుపుట అనే లక్ష్యమును ఇచ్చుటలో ఆ సాధనలు ఎప్పుడు ఎక్కడ అసమర్థములగునో, అప్పుడు అక్కడ అవి తమ ఉద్దేశ్యమునందు మరియు ఫలమునందు విఫలమైనవి; కావున వాటిలో మనము మార్పు చేసుకోవాలి, లేదా వాటిని త్రోసిపుచ్చవలెను. అట్లు గానిచో, అవి మనము అనవసరంగా కోరి కావాలని తెచ్చి పెట్టుకున్న జోడింపులుగా పరిణమించి, మనకు తగుల్కొని అనావశ్యకమగు భారమును కలిగిస్తాయి. కాబట్టి మనము ఈ సాధనలను తెలివిగా ఎన్నుకోవాలి. ఏ విధమైన ఆటంకములు, విలంబము, కొరత, లేదా వైఫల్యము లేకుండా, మనకు మన లోపలనే నిశ్శబ్దమైన దైవత్వసాక్షాత్కారముయొక్క దృష్టి అనే శాంతిపూర్ణమైన ఫలమును ఇచ్చే విధంగా ఈ సాధనలు ఉండాలి; వాటిని మనము ఆ విధంగా తీర్చి దిద్దుకోవాలి. అట్లు గానిచో, మనము ఆ సాధనలనుండి తొందరగా వెనుదిరిగి, శాంతముగా మనలో మనము ఉండిపోదాము.

ఇకపోతే, ఓ ప్రియమిత్రులారా! నన్ను క్షమించుడు. ఎందుకంటే, ఆరంభములోనే నేను మీకు ఒక వేరే గాథను చెప్తానని మీరు బహుశా అపేక్షిస్తూ ఉంటారని నా భయము. బహుశా నేను మీకు అన్నీ సిద్ధం చేసి పెట్టిన సాధనపద్ధతులను రూపకల్పన చేసి పెట్టి ఉంటానని, లేదా అట్టి

పద్ధతులను మీకు ఉపదేశిస్తానని, సమాధిని సాధించుటకై సాధనయొక్క ప్రక్రియను ఉపదేశిస్తానని మీరు అపేక్షిస్తూ ఉండవచ్చును. నా ఉద్దేశ్యము గాని, లక్ష్యము గాని అది కానే కాదని మీకు బహుశా ఇప్పుడే తెలిసిపోతుంది. నా మౌలికమైన లక్ష్యమునుండి నేను ప్రక్కకు తొలగ లేదు. నేను నా అసలు లక్ష్యమునుండి ప్రక్కకు దొలగ లేదు. నా మౌలికమైన విచారమును, నేను నా దృష్టిని కేంద్రితము చేసిన విచారమును, మీకు అవగతము చేయుటకై నేను ప్రయత్నిస్తున్నాను. స్వామి రామ తరచుగా ఇల్లా చెప్తూ ఉండేవారు: సమాధికి కొంత దూరము, దారి అనేవి ఉండుటకు వీలు లేదు; సమాధికి గుళికల పద్ధతి ఏదీ లేదు, అని. ఎందుకంటే, అది యెప్పుడూ దూరంగా లేదు.

సమాధి కేవలము మీ లోపలికి ఒక అడుగు వేయడం మాత్రమే. అంతే కాదు. సమాధి అంటే మీరు మీ మడమలపై వెను దిరిగినట్లు. లేదా, మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే, అదే క్షణమునందు, మీరు మీ స్వరూపమును చేరుకొనుటయే. క్రీస్తు మహాత్మునకు చెందిన నీతిగాథలయందు దారి తప్పిన కొడుకు అనే ప్రసిద్ధమైన కథ[1] గలదు. జనులు చాల తప్పుగా గ్రహించి, తప్పుగా అన్వయించుకున్న కథలలో దీనిని మొట్టమొదట పెట్టవచ్చును. ఇతరములైన ఉపాయములు, వనరులు పూర్తిగా విఫలమైనప్పుడు, ఆ దారి తప్పిన కొడుకు ముమ్మొందుగా తన స్వరూపములోనికి తాను వచ్చెనని చెప్పబడెను. ఆ తరువాతనే ఆతడు తండ్రి సన్నిధిలోనికి ప్రవేశపెట్టబడెను. ఆ తండ్రియొక్క ఇంటి లోపల విశ్రాంతి, శాంతి, సంపద మరియు ఆనందము నిండియుండెను. ఆహా! కొడుకు తిరిగి వచ్చిన శుభసందర్భములో తండ్రి ఇంటిల్లిపాదికి విందు చేయగా, వారందరు ఆనందముతో నాట్యము చేసిరి! ఆ సందర్భములో తప్పు చేసితిననే దిగులు గాని, మూతి విరుచుటలు గాని, నిందారోపణములు గాని, హక్కుల చర్చలు గాని, ముఖము

---

[1] ఒక తండ్రికి ఇద్దరు కొడుకులు. వారిలో ఒకడు బుద్ధిమంతుడు కాగా, రెండవ వాడు దారి తప్పినవాడు. ఆ రెండవవాడు తండ్రినుండి తనకు వచ్చిన ఆస్తి వాటాను దుబారా చేసి, సర్వమును కోల్పోయి, తిరిగి తండ్రి వద్దకు రాగా, తండ్రి వానిని ప్రేమతో స్వాగతించి అక్కున చేర్చుకుంటాడు.

ముడుచుకొనుట గాని, నుదుటిపై కోపపు రేఖలు గాని, ఏడ్పులు గాని, తప్పును ఒప్పుకొనుట గాని, అపరాధ రుసుములు గాని, కోపించిన వారిని సాంత్వపరచుట గాని, ప్రాయశ్చిత్తములు గాని లేకుండెను. ఎప్పుడైననూ ఇటువంటివాటి గురించి ఏ కొంచెము ప్రయత్నమును చేసిననూ, ఆ తండ్రి ఆ ప్రయత్నములను ప్రోత్సహించకుండా వమ్ము చేసెను. స్వర్గధామము ఇటువంటి ప్రయత్నములకు సరియగు స్థానము కానే కాదు. అక్కడ ఆత్మసాక్షాత్కారమును పొందిన జీవునకు తన హృదయమునందు సమాధికి చెందిన స్వర్గసుఖముయొక్క పరమానందము అంతా అనుభవానికి వస్తూ ఉంటే, ఇటువంటి నిరర్థక విషయములయందు ఒక్క క్షణమైననూ వృథా చేయరాదు. చూడుడు! లోపలి స్వర్గములు తమ ద్వారములను తెరువగా, దైవ-ఆత్మ, పావురము వలె, జీవుని పవిత్ర-ఆత్మను పూర్ణమగు దైవీ-పవిత్రతతో మరియు శాంతితో నింపివేస్తూ ఉన్నది. ఆ దైవ-ఆత్మ పవిత్రతకు మరియు శాంతికి పెన్నిధి. ఆ సమాధియందు దేవునకు, జీవునకు భేదము లేదు. అదియే యథార్థమైన ప్రాయశ్చిత్తము[1]. ప్రియమిత్రులారా! మీరు నిత్యముగా ఏది అయి ఉన్నారో, ఆ స్వరూపమును గుర్తెరుంగుటయే చేయదగినది. మీరు సర్వకాలములయందు ఏ చైతన్యము అయి ఉన్నారో, దానిలోనికి మేల్కాంచుటయే చేయదగినది. మీ స్వరూపమునందు పాపము లేదు; పాపము ఉండే ఆస్కారమే లేదు. మీరు నిత్యముగా భగవానునిచే పుత్రుడుగా, ఉత్తరాధికారిగా స్వీకరించబడియే ఉన్నారు. మీరు అమృతపుత్రులు. మీరు నిత్యప్రకాశ దైవీ-ఆనందముయొక్క సంతులు. మీరు సర్వదా పరమాత్మతో అభిన్నులై ఉన్నారు. కాలాతీతుడైన పరమాత్మ జగత్తునకు తండ్రి. ఆ తండ్రి యెదలో మీరు ఏకైక ప్రేమపాత్రులు. మీరు ఏ నాడైననూ తండ్రి యెడల పాపమును చేయలేదు

---

[1] ఇక్కడ స్వామీజీ atonement అనే ఇంగ్లీషు పదమునకు చాలా అందముగా శ్లేష (రెండు అర్థములను చెప్పుట) ను చేసినారు. ఒకటి ప్రాయశ్చిత్తమైతే, రెండవది at-one-ment, జీవేశ్వరుల అభేదము. స్వామి ఓంకార్ మహారాజుల వారు క్రైస్తవ సాహిత్యములోని గాథకు ఇక్కడ వివరించిన అంతరార్థము క్రైస్తవపండితులకు కూడ ఉపాదేయము.

అని తెలుసుకొనుడు. ఎందుకంటే, తండ్రికి విరుద్ధముగా పాపమును చేయుట, తండ్రి నొచ్చుకొనేట్లు చేయుట సంభవమే కాదు. ఆ తండ్రి పుత్రుడు కూడ పాపమును చేయజాలడు. ఎందుకంటే, ఆ పుత్రుడు ఏ నాడైననూ తండ్రి కంటె వేరుగా లేడు. తండ్రికి ఆ విషయము ఎల్లవేళలా తెలియును. తనను తాను తెలుసుకున్నప్పుడు, తన చైతన్యస్వరూపములోనికి మేల్కాంచినప్పుడు, ఆ సత్యము కొడుకునకు కూడ తెలిసింది.

కాబట్టి, తప్పు పేరు[1] తో పిలువబడే ఓ దారి తప్పిన జనులారా! అన్నింటికంటె సరళమైన మరియు తక్కువ దూరము గల దారి మీ ముందు తెరుచుకుని ఉంది. అపవిత్రములు (అమంగళములు, పాపములు) లేవు, ద్వారములు లేవు, గుడి ప్రహారీలు లేవు. కరడు గట్టిన అజ్ఞానము వలన మాత్రమే అవి అన్నీ ఉన్నట్లు భాసిస్తోంది. కాబట్టి దేహమే ఆత్మ అనే అజ్ఞానపు పరదాను మీరు ముక్కలు ముక్కలుగా చింపివేయుడు. వెంటనే ద్వారములను విరుగగొట్టుడు, గోడల బండ రాళ్లను లాగి పారవేసి పునాదులతో సహా కూల్చివేయుడు[2]. పదార్థముల గుండా పదార్థములయందలి యథార్థతత్త్వమునరయుడు. పదార్థముల లోపలి అసలు సిసలు తత్త్వమును పట్టుకొని, వాటిని (నామరూపములను) వదలి పెట్టుడు. పండు లోపలి గుజ్జును అట్టి పెట్టుకుని తొక్కను పారవేయుడు. అది మీ జన్మహక్కు. దాని కొరకై మీరు శ్రమించి సంపాదించనక్కరలేదు, దాని కొరకై (ఇతరులను) కోరనక్కరలేదు. శ్రామికులై శ్రమిస్తున్నంత వరకు దానిపై హక్కు, దానిని ఎంచుకొనుట అనేవి ఉండవు. వారు రోజు కూలికి మాత్రమే అర్హులౌతారు. వారు ఆ రోజు కూలిని తీసుకుని సత్య-ఆత్మకు దూరంగా ఉండిపోతారు. అట్టి కూలీలు కూలి గింజలకై వేడుకుంటూ ఉంటారు[3]. వారు కాలముయొక్క

---

[1] అసలు పేరు పరమాత్మ.

[2] అజ్ఞానము వలన కలిగే కామనలను, భయములను పారద్రోలుడని అభిప్రాయము.

[3] అల్పమైన ఫలమును కోరి కామ్యకర్మలను చేయువారని స్వామీజీ ఆశయము.

సంతానము[1]. కాలముయొక్క సంతానమైన అట్టివారికి ఆ శ్రమ, దాని వలన గిట్టే కూలి సరిపడతాయి. కాని, మీరు అమృతపుత్రులు. శాశ్వతపితయగు ఆ పరమాత్మ మీకు ప్రాణశక్తియొక్క అమృతము[2] ను శాశ్వతకాలము సరఫరా చేస్తూ ఉంటాడు. దానిని మీరు ఉచితముగా పొంది స్వతంత్రులై ఆనందించుడు.

కాబట్టి, ఓ ప్రియమిత్రులారా! ఇప్పుడు నేను సుదూరమైన, చుట్టూ తిరిగే, కష్టసాధ్యమైన, లేదా నిగూఢమైన దారిని చెప్పి మిమ్ములను నిరుత్సాహపరచి ఉండవచ్చును. దానికి కారణమేమంటే, మీకు చాల సంతోషముతో కూడిన అచ్చెరువును కలిగించే దారిని చూపుటయే నా అభిప్రాయము. ఆ దారి పైన చెప్పిన దారికంటె తేలికయైనది, సరళము, సులభతరము. వాస్తవంలో ఈ దారి దారులన్నింటికంటె దగ్గర, సులభము మరియు సరళము. నిజం చెప్పాలంటే ఇది దారి కానే కాదు. ఇది కేవలము కన్నులను తెరచి చూచుటయే, మీలోపల మీరు దైవస్వరూపులై ఉన్నారని గుర్తెరుగుటయే, మీ శాశ్వతమైన వారసత్వమును గుర్తు పట్టుటయే.

పృథివి అంతము వరకు (దేహాభిమానముతో) పరిభ్రమిస్తూ శ్రమించే ఓ జనులారా! నా వైపు చూడుడు. మీరు చేయాల్సినది ఇంతే. వెనుదిరిగి (అంతర్ముఖులై) మీ లోపల చూడుడు, రక్షణను పొందుడు. నేను-భావనను పైకి లాగి[3] (స్వరూపముపై) కేంద్రితము చేసినచో, ఆ నేను-భావనయే సకలజనులను నా వద్దకు ఆకర్షించగలదు. దాని వలన దేహము అనే బంధము, పరిభ్రమణము[4] లనుండి విముక్తి కలుగును -- ఇదియే శుభవార్త. మీలోనే ఉన్న స్వాతంత్ర్యము, ఆనందము మరియు శాంతి అనువాటికి చెందిన సంక్షిప్త సువార్త ఇదియే.

---

[1] వారు పుట్టి గిట్టుతూ కాలముచే కబళించవేయబడే సుఖములను పొందుతారని అభిప్రాయము.

[2] జ్ఞానఫలమగు మోక్షము.

[3] అంటే దేహాభిమానమును విడిచిపెట్టి అని యర్థము.

[4] చావు-పుట్టుకలు

కాబట్టి, నీ స్వరూపములోనికి మరియు వారసత్వములోనికి మేల్కొంచి, నీ స్వరూపమును నీవు పొందినవాడవై, నీ యథార్థమైన హోదాకు మరియు హక్కుకు తగ్గట్లుగా జీవించుము. నీ దైవత్వమును నీవు సర్వదా నిత్యనూతనముగా అనుభూతికి తెచ్చుకో! నీకు ఆ విధముగా అనిపించకున్నా, అది నీవే అనే అనుభూతిని పొందుము. ఎట్టి పరిస్థితులలోనైనా సరే నీయందలి ఈ దైవీ చైతన్యమును పట్టుకొనుము, పట్టు విడువకుము. నీ జీవితములో ఏ నాడైననూ దానిని విడిచిపెట్టకుము. మందగింపు కారణముగా గాని, లేదా నీ వైపునుండి జాగరూకత లేని కారణముగా గాని, నీ దైవత్వమనే విలువ కట్టలేని సత్యమును మరువవద్దు, ఆ సత్యము విషయములో అశ్రద్ధ చేయవద్దు. దేశకాలములు మరియు దేహాభిమానములకు చెందిన ఈ జగత్తుయొక్క సకలసంపదలు, అధికారము, సౌందర్యము మరియు భోగము అనేవాటికి బదులుగా ఆ దైవత్వమును విడనాడకుము. ఎందుకంటే, రెండవది లేని ఏకైకమైన నీ ఆత్మీయమైన చైతన్యమును పోగొట్టుకొని, దాని స్థానమునందు సకలజగత్తుయొక్క చైతన్యము లభించినా, అది నీకు ఏ విధముగా లాభమును చేకూర్చగలదు? ఈ జగత్తుయొక్క ఆట వస్తువులు నిన్ను, నిత్యసత్యమైన దైవత్వముతో ఒక్కటియై ఉన్న చైతన్యములోనికి శాశ్వతముగా మేల్కొంచిన నిన్ను, ఏ విధముగా ఆకర్షించగలవు? నీ హృదయములోని తండ్రి వద్ద నీకు ఆవశ్యకములను ఇచ్చుటకు తగినంత వ్యవస్థ గలదు. దాని వలన నీకు సత్యము కొరకు మరియు ఆనందము కొరకు ఏ నాడైననూ బాహ్యప్రపంచములో వెదుకవలసిన పరిస్థితి ఏర్పడబోదు. అంతేగాక, నీకు బాహ్యమునందలి గురువులు, సహాయకులు మరియు రక్షకుల ఆవశ్యకత కలుగబోదు. ఆ అధిచేతన (సర్వాతిశాయి యగు యెరుక), ఆ లోపలనున్న పవిత్రమైన చైతన్యప్రకాశము తన అనుగ్రహంతో నిన్ను అభిషేకించి పట్టాభిషిక్తుని చేసి, నీకు బోధించి, సర్వసత్యములోనికి నిన్ను నడిపించగలదు. ఎందుకంటే, నీవు సత్యమునకు చెందినవాడవై, నీవే సత్యస్వరూపుడవై ఉన్నావు.

ఇప్పుడు మరో సంగతి చూద్దాము. మనము దైవత్వమును సృష్టించలేము, కొనలేము. లేదా మనము వినయముతో ప్రార్థించి గాని,

లేక లంచము ఇచ్చి గాని దైవత్వమును సంపాదించలేము. అంతేగాక, లెక్కలేనన్ని ప్రార్థనలైననూ, ప్రయత్నమైననూ దైవత్వమును పొందుటకు తగినంత పుణ్యమును ఈయజాలవు. మనము దైవత్వమును ఏరి కోరి సంపాదించలేము. వీటన్నింటికంటె పైన, మనందరిలో దైవత్వము సర్వదా ఉండనే ఉన్నది అనేది సత్యము. మనలోని దైవత్వము మనకు తెలియని కారణముగా మనము దాని కొరకై వెదుకులాడుతున్నాము. మనము జీవించి ఉన్నాము అనే సత్యమును మనము గుర్తించనిచో, మనము అచేతనులమై, లేదా శవముల వలె, పడి ఉండక తప్పదు. మనలో ప్రాణశక్తి, ఆనందము మరియు శాంతి వెల్లి విరియాలంటే, మనకు ఆ చైతన్యము గలదు అని, మనకు దానికి భేదము లేదు అని మనం తెలుసుకుంటే చాలును. అది సర్వదా మనయందే ఉన్నది అనేది సత్యము. యథార్థంగా చెప్పాలంటే, మనము సర్వదా ఆ చైతన్యమే అయి ఉన్నాము.

ఏదైనా ఒక వస్తువుతో అభిన్నమై ఉండాలంటే, ఆ వస్తువే అయి ఉండాలి. అదే విధముగా, మనము ఆ శాశ్వతసత్యము కానిచో, మనము స్వయంసిద్ధమైన సత్యతత్త్వమే అయి ఉండనిచో, మనము ఆ సత్యమును ఎంత కోరుకున్నా, ఆశ పడినా, దాని కొరకై ప్రయత్నించినా, ఎన్నటికీ అదియై ఉండుట గాని, అది అగుట గాని, దానితో అభేదముయొక్క అనుభూతిని పొందుట గాని సంభవమే కాదు. దైవత్వమునకు చెందిన తత్త్వము మాత్రమే దైవాంశయై దైవత్వమునందు విలీనమగును. రక్తమాంసాలకు చెందినవి రక్తమాంసాలు మాత్రమే; రక్తమాంసాలు దైవసామ్రాజ్యమునకు వారసులు కాలేవు; పవిత్రాత్మయందలి ధర్మము, దైవత్వముయొక్క అనుభూతి, శాంతి మరియు ఆనందములే దైవసామ్రాజ్యములు. అవి దానియొక్క సహజసిద్ధమైన నిరతిశయ-ఆనందము (మోక్షము) లు. అవి మానవుని ఆంతరమునందు ఆ దైవత్వముయొక్క సహజసిద్ధమైన వారసత్వము, అనుభూతి మరియు ప్రకటరూపములు. వాటిని ఆధ్యాత్మికముగా (చైతన్యపరముగా) వివేచన చేయాలి. రక్తమాంసములు, దేహమునకు చెందినవి, ఆ ఆనందములను వివేచన చేయలేవు, వాటిని అంచనా కట్టజాలవు. ఆధ్యాత్మికసాధన చేసే

మనిషి తన ఆనందఘనమైన సత్తను అనుభవిస్తూ ఆనందించే అంశములు అవి (ఆంతర-ఆనందములు) మాత్రమే. అక్కడ జగత్తే వానికి దేవాలయము; సకలపదార్థముల సారతత్త్వమైన పరబ్రహ్మయే ఆత్మరూపముగా ఆ దేవాలయమునందు వెలసిన దేవుడు. అక్కడ ఆతని నేను-భావన, అనగా ఆతని దైవ-ఆత్మ, ఆంతరమునందలి స్వర్గముయొక్క సింహాసనమును అధిష్ఠించి యున్నది. అక్కడ ఉన్నది అంతా జ్ఞానము, పవిత్రత, శాంతి మరియు ఆనందము. రక్తమాంసముల సంతు (అంటే దేహాత్మభావన గలవారలు), వారు యెవరైనా, అక్కడ వెలివేయబడెదరు. వారు బాహ్యమునందలి అంధకారమునకు చెందినవారు. లోపలికి తొంగి చూచుటకైననూ వారికి హక్కు లేదు. ఏడుపు, (కోపముతో) పళ్లను కొరుకుట, చేదైన అనుభవము మరియు హృదయతాపము అనేవి వారి వాటా. ఆత్మకు చెందిన సర్వము (వారికి) చిక్కు ప్రశ్న మరియు చీకటి గాథయే. వారికి ఆత్మకు చెందిన విషయములు అర్థము కావు. ఎందుకంటే, ఆత్మవిషయములను ఆత్మనిష్ఠములైన ఇంద్రియములతో ఆధ్యాత్మికముగా వివేచన చేయాల్సి ఉంటుంది. కవిని కవి మాత్రమే మెచ్చుకొనగలడు, అనుకరించగలడు. ఒక క్రీస్తు[1] మాత్రమే క్రీస్తును తెలుసుకొనగలడు, క్రీస్తును కనిపెట్టగలడు. దేవుడు మాత్రమే దేవుని తెలియగలడు, దేవుడై ఉండగలడు. ఏకత్వనియమము అట్టిది. మీరు పాపిని శాశ్వతకాలము ఏదేని ఒక ద్రవములో గాని, ఔషధద్రావకమునందు గాని కడిగిననూ, ఆతడు ఇసుమంతైననూ సాధుపురుషుడు కాజాలడు. ఆఖరికి అట్టి దివ్యౌషధము గాని, దివ్యప్రక్రియ గాని దేవుని వద్ద కూడా లేదు. అట్లు జరుగుట అసంగతమగును. అది బొగ్గును కడిగి తెల్లగా చేసినట్లు అగును. మీరు బొగ్గును శాశ్వతకాలము బాగా రుద్ది కడుగవచ్చును. కాని, అది యెన్నటికీ తెల్లగా అవబోదు. అదే విధముగా, మీరు ఇప్పటికే దైవత్వసంపన్నులు అయి ఉండనిచో, మీరు యథార్థముగా దైవత్వసంపన్నులు అగుట గాని, దైవత్వమును అనుభవమునకు తెచ్చుకొనుట గాని అసంభవమయ్యేడిది. ఇది సృష్టి ఉన్నంతకాలము మార్పు లేని సత్యము.

---

[1] దేహాభిమానము లేని ఆత్మనిష్ఠుడు అని స్వామీజీ అభిప్రాయము.

పవిత్రమైన అంతఃకరణము గల వ్యక్తికి సర్వము పవిత్రముగా కనబడును. అవిత్రునకు అన్నీ అపవిత్రములే. ఇదే విధముగా, ఎవడైతే సత్యతత్త్వమునకు చెంది ఉంటాడో, సత్యతత్త్వమునందు నిలిచి ఉంటాడో, లేదా తానే సత్యతత్త్వమై ఉంటాడో, వానికి లోపల మరియు బయట సర్వము సత్యమే. వానికి ఉన్నది సత్యతత్త్వము మాత్రమే. భూతవర్తమానభవిష్యత్కాలములయందు అతడు సత్యమును మాత్రమే దర్శించును. రూపములయందు మరియు రూపము లేనివాటియందు అతడు సత్యతత్త్వమునే గుర్తించి, దానిని మాత్రమే కొనియాడును. వాని దృష్టిలో నిలిచి ఉండేది సత్యతత్త్వము మాత్రమే. ఆకసమునందు గాని, నేలపై గాని, స్వర్గమునందు గాని, నరకమునందు గాని, సుఖమునందు గాని, దుఃఖమునందు గాని మార్పు లేని, మార్పు చెందని సత్యతత్త్వము మాత్రమే ఉన్నది. ఆతనికి అంతా సమానమే. ఆతడు ఆ సత్యము (పరబ్రహ్మ) తో ఐక్యమై ఉండును.

ఓ పరమపవిత్రమైన సత్యమా! మిత్రులు మరియు శత్రువులు, ప్రక్క యింటి వాళ్లు మరియు పరదేశీయులు, బ్రదికి యున్నవారు మరియు మరణించినవారు, చేతనములు మరియు జడముల రూపములో నీవే ఉన్నావు. నీ దర్శనము మాకు నిరంతరముగా ఉండేట్లుగా మమ్మ ఆశీర్వదించుము! తెలియబడేది నీవే! తెలియబడనిది నీవే! భయంకరమైనవాటియందు నీవే ఉన్నావు! శాంతమైనవాటియందు నీవే ఉన్నావు! జ్యోతులకు జ్యోతివి నీవే, ప్రాణుల ప్రాణశక్తివి నీవే. జీవనసంగ్రామమునందు నీవే ఉన్నావు! శాంతియొక్క నిశ్శబ్దమునందు నీవే ఉన్నావు! క్రూరులయందు నీవే ఉన్నావు! దయామయులయందు నీవే ఉన్నావు! దుష్టులయందు నీవే ఉన్నావు! మంచివారియందు నీవే ఉన్నావు! సాధుపురుషుడు మరియు పాపి కూడ నీవే! సూర్యునియందు మరియు ఆ సూర్యునినుండి వెలువడే కిరణములయందు నీవే ఉన్నావు! కాంతి నీవే, ఆ కాంతియొక్క ప్రకాశము మరియు దాని శోభ నీవే! గొప్పది నీవే, తక్కువది నీవే! బ్రహ్మాండము నీవే, అణువు నీవే! ఎలక్ట్రాన్ మరియు దానిని కంపింపజేసే శక్తి నీవే! సర్వము మరియు సర్వాలు నీవే! సర్వత్రా నీవే ఉన్నావు! ప్రతి అణువులో ప్రకంపించేది నీవే! నీతో మాకు

ఉన్న విడదీయరాని ఐక్యము మాకు మా జీవితములలో ప్రతి క్షణము అనుభవానికి వచ్చేట్లా చేయుము.

కాబట్టి మనము ఒక సంగతిని దృష్టిలో ఉంచుకోవాలి. మనము ఉన్న అవస్థలో మన భావాలు, పై అవస్థలలో వస్తువుల వాస్తవికతకు చెందిన స్థితిగతులకంటె చాల తక్కువ స్థాయిలో ఉన్నాయి. సమాధి-అవస్థ (అధిచేతన స్థితి), దానికి చెందిన ఆనందములను గురించి ప్రస్తుతంలో మనకు ఉన్న భావాలు, సత్యసాక్షాత్కారమునకు చెందిన ఉన్నత-అవస్థలయందు, సుతరాము సరిపోవు. ఇక్కడ ఉన్నట్లుగా, అక్కడ సర్దుబాట్లకు గాని, ఆసనములకు గాని, వ్రతము (నియమనిష్ఠలు) లకు గాని, అనుష్ఠానములకు గాని, ప్రయత్నములకు గాని, ప్రయాసలకు గాని తావు ఉండదు. కాలము, దేశము, ఒడ్డు-పొడవులకు చెందిన భావనలు గాని, లేదా ప్రస్తుతం ఉన్న కారణకార్యభావమునకు చెందిన సిద్ధాంతములు గాని అక్కడ నియంత్రించవు. ఆకాంక్ష, అనుభూతి అనేవే అక్కడి ఉనికిని నియంత్రించే సిద్ధాంతములు. మీరు ఆకాంక్షించండి, మీకు అది ఉన్నది, మీరు దానిని అనుభవానికి తెచ్చుకోండి. మీరు నాయందు (దైవమునందు) నిలిచి (ఐక్యమై) ఉన్నట్లైతే, మరియు నేను (దైవము) మీయందు నిలిచి ఉన్నాను గనుక, మిమ్ములను ఆవేశించి ఉన్నాను గనుక, మీ హృదయసింహాసనమును అధిష్ఠించి ఉన్నాను గనుక, మీరు దేనిని ఆకాంక్షిస్తే, అది మీ స్వంతము అవుతుంది. అది స్వర్గముయొక్క నియమము. మీ వాస్తవచేతన దైవముకంటె అభిన్నము, వేరే ఏదీ కాదు. మీరు ఆ ఏకత్వమును శాశ్వతముగా అనుభూతికి తెచ్చుకోవాలని కోరుకుంటున్నారా? అట్లైనచో, మీకు ఆ ఏకత్వము శాశ్వతముగా లభిస్తుంది. మీరు అటులనే కోరుకుంటారని అనుకుంటాను. ఆ ఏకత్వమునకు విరుద్ధమైన నియమము ఏదీ లేదు. ఏదీ దానిని అడ్డు పెట్టలేదు. దానినుండి మిమ్ములను రవంతయైననూ ఒక్క క్షణమైనా ప్రక్కకు తప్పించేది యేదీ లేదు. కాబట్టి, శాశ్వతసత్యముయొక్క సంతానమైన ఓ జనులారా! మీరు శాశ్వతసత్యమునందు నిలిచియుండుడు. ఎందుకంటే, మీరు శాశ్వతసత్యమునకు చెందినవారై శాశ్వతసత్యమునందే, శాశ్వతసత్యమే అయి ఉన్నారు. శాశ్వతపిత

(మూలపురుషుడు), శాశ్వతసత్ అగు పరమాత్మయొక్క నియమముచే అది మీకు శాశ్వతమైన జన్మహక్కు. మీ ఆత్మలను నిత్యశాంతియందు ఆవేశింపజేయుడు. ఎందుకంటే, ఆ శాంతి సకలకాలములయందలి సకలవస్తువులయొక్క సకలజ్ఞానమును కూడ అధిగమించి యున్నది.

మీరు దైవమునుండి మీకు సంక్రమించిన జన్మహక్కు అగు ఈ చైతన్యమునందు ఒకే ఒక క్షణము నిలిచి ఉండగల్గినారనుకొనుడు. అప్పుడు మీరు ఆ చైతన్యమునందు రెండు క్షణములు ఉండగలరు. అదే క్రమములో ఎన్ని నిముషములైననూ, గంటలైననూ కూడ నిలిచి ఉండగల్గుదురు. ఈ విధముగా మీరు ఈ దైవీచేతనయొక్క కాలమును పెంచవచ్చును, దానిని గాఢము కూడ చేయవచ్చును. అప్పుడు మీరు దేశము, కాలము, కారణకార్యభావముల చేతననే అధిగమించగల్గుదురు. అప్పుడు అనంతత్వముయొక్క స్థాయి మీకు అందుబాటులోనికి వచ్చును. ఆ స్థాయి చాల విస్తృతమైనది, శూన్యము వంటిది. ఆ స్థాయి మీకు శాశ్వతముగా అందుబాటులో ఉండిపోవును. దాని వలన మీ దేహము, ప్రపంచవిషయముల పైకి పరుగెత్తే ఇంద్రియములు నిరుపయోగములై, ఆ కారణముగానే పూర్తిగా చెరిపి వేయబడును; కర్మరాహిత్యం వలన అవి క్షీణించును. మీరు చేసే పనులు ఆధ్యాత్మికములైన[1] ఇంద్రియముల ద్వారా ఆధ్యాత్మిక స్థాయి వైపు అభిముఖములై, నిరంతరముగా అదే స్థాయికి అనువర్తించును. దేహము విషయమై మరణించి ఆత్మ విషయమై జీవంతముగా చేయబడినవాడు అనే నానుడికి తగ్గట్లుగా మీరు తీర్చి దిద్దబడతారు. మీరు ప్రపంచము మరియు తక్కువ స్థాయికి చెందిన ఆత్మ[2] విషయమై మరణించినవారై, మీ జీవము ఉన్నతస్థాయికి చెందిన (యథార్థమైన, ఉపాధి-తాదాత్మ్యము లేని) ఆత్మకు అభిముఖముగా వేగిరపడును. శారీరక భోగముల వెంట పడే మనస్సు వెనుక నడచుట మాని, మీరు ఆత్మ వెంబడి స్వర్గమయజీవనముయొక్క నూతనత్వములోనికి నడువ మొదలిడెదరు.

---

[1] శమదమాదుతలో కూడినవి.

[2] దేహాదులతో తాదాత్మ్యము వలన పుట్టిన కల్పిత-ఆత్మ.

మీరు ఒక మార్పును, ఒక వినూత్నజన్మను, ఒక పునరుజ్జీవనమును పొందినారు. ఇప్పుడు మీరు స్వర్గము లేక ఆంతర-ఆనందముయొక్క సామ్రాజ్యములో ఉన్నారు. ఇప్పుడు జీవితదృక్పథము, జీవనవైఖరి పూర్తిగా మారిపోయినవి. మొత్తం సంబంధం (ప్రపంచముతో) మారిపోయినది. ఈ పైన మీరు రక్తమాంసములకు లేదా దేహమునకు చెందిన వ్యక్తులను గాని, వస్తువులను గాని యెరుగనే యెరుగరు. మీరు స్వర్గలోకనివాసి అయినారు గనుక, ఇప్పుడు మీ సంభాషణము లోపలి స్వర్గమునందలి తండ్రితో మాత్రమే ఉండును. ఇప్పుడు ఆత్మనిష్ఠులై ఉండుట చాల సహజము అయినది. మిమ్ములను దానినుండి మళ్లించుటకు ఒక అద్భుతము జరుగవలసియుండును. అంతకు తక్కువ మిమ్ములను మీ నిష్ఠనుండి తప్పించలేదు. అంతే గాదు, మిమ్ములను మీ నిష్ఠనుండి తప్పించుట అసంభవమని కూడ చెప్పవచ్చును. ఈ దేహమునందు మరియు ఈ ప్రపంచమునందు సుఖము గాని, సంతృప్తి గాని సుతరాము లేని పౌరులై ఉండుటను మీరు విడనాడినారు. మీరు పూర్తిగా మారిపోయినారు. ఎంత మారిపోయేరంటే, మీరు ఈ దేహమునందు, ఈ ప్రపంచమునందు అపరిచితులు మరియు పర్యాటకులు అయినారు. దేహసంబంధము లేకుండా భగవానునియందు, ఆత్మనిష్ఠయందు ఉండుట మీకు సహజసిద్ధమైనది. ఇప్పుడు మీకు ప్రతి రోజు భగవానుని దినమే, అంటే పవిత్రము చేయబడినది, మరియు ఆనందదాయకము. ఇప్పుడు మీకు జీవితము అడ్డు-ఆపు లేని ఆనందమయ సంగీతము. దీనికి అంతకూ కారణము మీరు దేహనిష్ఠులై ఉండకుండా ఆత్మనిష్ఠులై ఉండుటయే.

బాగున్నది. సరిగ్గా ఇదే విషయంలో మీకు సందేహము (ఆశ్చర్యము) కలుగువచ్చును. ఇటువంటి దైవత్వానుభూతి కలగాలంటే కఠినమైన అనుశాసనము మరియు అనేకసంవత్సరములు, లేదా ఒక జీవితకాలము, లేదా అనేకజన్మల కఠోరపరిశ్రమ ఆవశ్యకమగునేమో! కొందరికి ఆవశ్యకము కావచ్చును. కాని మీ విషయంలో అట్లు కానక్కరలేదు. ఓ ప్రియమిత్రులారా! నేను మీకు ఒక విచిత్రమును గురించి చెప్తాను. ఎవరైతే ఒక క్షణమునందు దేహేంద్రియముల విషయమై జాగరూకులుగా ఉంటూ

ఆత్మ విషయమై మృతప్రాయులై ఉండిరో, కాని వారే మరుక్షణమునందు, లోపల భగవానుడు ఆవిర్భవించుట వలన, వారి జన్మహక్కు అగు ఆత్మయొక్క అనుభూతియందు లగ్నమగుదురు. వారు ఖండితమైన దృష్టి గలవారే అయినా, ద్వైతముచే ప్రభావితమైన వాతావరణము ఉన్నప్పటికీ, జన్మసిద్ధమైన ఆ అధికారము లభించుటకు కనురెప్ప పాటు కాలము కూడ పట్టదు. వారు పరమాత్మయొక్క అనుభూతియందు నిమగ్నులై శాశ్వతముగా ఆత్మనిష్ఠులయ్యేటంతవరకు వారి దృష్టి పై పైకి ప్రసరించును. వారు ఒక తరము కాలమును ఒక క్షణములో దాటి వేసెదరు. నెలలు, సంవత్సరములు, లేదా ఒక జీవితకాలము కూడ, శూన్యమా అన్నట్లు, సరళముగా అంతర్ధానమగును. ఇంతేగాక, మీరు ఈ మీ విశిష్టమగు దేహముయొక్క అభిమానమును కలిగి ఉండరు. మీ ప్రస్తుతజన్మ గాని, ప్రస్తుతదేశకాలములకు చెందిన ఈ ప్రపంచము గాని ఇంకెంత మాత్రము మీ చైతన్యములో భాగములు కావు. దానియందు భూతభవిష్యద్వర్తమానములు అన్నీ ఒకటి కాబోతున్నాయి. మీరు ఇప్పుడు సాక్షాత్తు ఆద్యంతములు లేని తత్త్వమునందు ఉన్నారు. సర్వము ఒక్కటియే. నీ దృష్టిలో, అనాది కాలమునుండి అనంతకాలము వరకు నీవే ఆ దైవమై ఉన్నావు. ఏ పరమాత్మయైతే కాలాపేక్ష లేనివాడో, దేహముయొక్క పరిసరముల సమన్వయమునకు మరియు ప్రపంచమునకు అతీతుడో, ఆ అద్వయ పరమాత్మతో మీరు ఒక్కటై ఉన్నారు. దానియందు మీరు పరమాత్మయొక్క మరియు శాశ్వతత్వముయొక్క సామ్రాజ్యముయొక్క హద్దులు లేని స్వాతంత్ర్యములోనికి నూతనముగా జన్మిస్తారు. దేహాభిమానముయొక్క బంధములోనికి మీరు మరల జన్మించరు. మీ వినూత్నదర్శనమునకు శాశ్వతత్వముయొక్క స్వర్గములు తమంత తాము తెరుచుకున్నవి. మీరు పదార్థముల వాస్తవతత్త్వము (పరబ్రహ్మ) యొక్క సాక్షాత్-సన్నిధియందు నిలిచి యున్నారు. ఆ అనుభూతి మీలో కలిగి మీకు తెలుస్తూ ఉంటుంది. మీరు ఆత్మయొక్క హద్దులు లేని ప్రపంచముయొక్క కేంద్రమునందు అధిష్ఠించి యున్నారు. దానిని ప్రపంచము అనవచ్చునా? ఏమో! అక్కడ దేహమునకు చెందిన మరియు దేహముయొక్క స్థాయికి చెందిన భాషతో

సుతరాము చెప్ప శక్యము కాని తత్త్వములను మీరు చూస్తారు. సర్వము ప్రేమ, ఏకత్వము, ఆనందము మరియు శాంతి. గొప్ప మహిమ! మహిమ! మహిమ!

మీరు శాశ్వతసత్యము మరియు అతిశయ మహిమ (పరమాత్మ) యొక్క ప్రియసంతానము. కాని, మీరు ఇప్పుడు కాలము-దేహముల బంధములో ఉన్నారు. కావుననే, ఆ సద్రూపులై ఉండుటయొక్క అనుభూతి మీకు ఇంకా తెలియుటలేదు. కాని, ఎప్పుడైతే మహిమాన్వితమైన ఆ సద్-అనుభూతి మీకు అవిష్కారమౌతుందో, అప్పుడు మీరు ఆ సద్రూపులుగా ఉండే విధంగా పరివర్తన చెందుతారు. అప్పుడు ఆ స్వర్గమునందలి వారు ఏ విధమైన జ్ఞానమును మరియు అనుభూతిని పొందుతారో, మీరు కూడ అదే విధమైన జ్ఞానమును మరియు అనుభూతిని పొందుతారు. ఇప్పుడు కప్పివేయబడినదై చర్మచక్షువునకు కానరాకుండా ఉన్నప్పటికీ, అప్పుడు మీ ఆధ్యాత్మిక (జ్ఞాన) నేత్రమునకు అంతా తేటతెల్లముగా నుండును. ఇప్పుడైతే ప్రాకృతికము ఆధ్యాత్మికమును గ్రహించలేదు. ఎందుకంటే, ఆధ్యాత్మికస్థాయిలో ఆధ్యాత్మికదశయందు ఆధ్యాత్మికములైన ఇంద్రియములతో ఆత్మానాత్మవివేకపూర్వకముగా సత్యమును తెలియాలి. పరిచ్ఛిన్న (అల్ప) మైన మనస్సు, మున్ముందుగా అనంతతత్త్వమునందు విలీనమై ఐక్యము కాకుండా, ఆ అనంతతత్త్వముయొక్క స్వభావమును మరియు సౌందర్యమును గ్రహించలేదు. కాబట్టి సత్యమును అడ్డుకుంటున్న అజ్ఞానపు పొరలు అనే గోడ తనంత తానుగా పడిపోవునట్లు చేయుడు. ఎప్పుడైతే మీకు అతిశయించిన తీవ్రమైన జిజ్ఞాస కలుగునో, అప్పుడు ఆ జిజ్ఞాసయొక్క ఆదేశముచే ఆ గోడ పడిపోవుటకు సిద్ధమగును. అప్పుడు అజ్ఞానమనే బుడగ పగిలిపోవును. ఇప్పటివరకు ఆవరించబడిన ఆకాశము ఇప్పుడు హద్దులు లేని విస్తారములో విలీనమగును. ఇది సత్యము. ఎప్పుడైతే మీయొక్క ఆ అల్పమైన నేను-భావన, మీ అహంకారము, మరణించినదో, లేదా కరిగిపోయినదో, లేదా విలీనమైనదో, లేదా మరోలా చెప్పాలంటే విముక్తిని పొందినదో, లేదా తన పై స్థాయికి ఎదిగినదో, అంటే తనను

తాను సరిదిద్దుకుని శుద్ధమైనదో, పై తత్త్వమునందు కేంద్రితమైనదో, లేదా ఊర్ధ్వముఖము చేయబడినదో, అప్పుడు ఆ గొప్ప నేను, వైశ్విక పురుషుడు, పరమాత్మ, లేదా మహాశూన్యము, తరంగములు లేని మహాసముద్రము, శాంతి సముద్రము, అనంతత్వముయొక్క ఆనందసముద్రము మాత్రమే మిగిలియుండును.

కాని ఆగుము. మీ లోపల గాలి లేనిచో, వాతావరణ ఒత్తిడియే మిమ్ములను నలగకొట్టివేయును. ఏ గాలి ప్రాణాలను నిలబెడుతూందో, అదే గాలి ఒక క్షణములో ప్రాణములను తీయును. ఇదే విధముగా, మీ లోపల (స్వరూపమునందు) ఆద్యంతరహితమగు పరమాత్మ లేనిచో, ఆ పరమాత్మ మీరే కానిచో, మీరు కేవలము అహంకారము మాత్రమే అయి విశ్వాత్మ కానిచో, మీ మూలాలు కదిలిపోతాయి. ఆ శూన్యముయొక్క స్వాతంత్ర్యము, ఆ విస్తారముయొక్క అతిశయము మీపై ఆఘాతమును వేసి, మిమ్ము నలిపివేయుటకు సమయము పట్టదు. మీరు అతిసరళముగా నురగవలె ఒడ్డు మీదకు విసిరి వేయబడెదరు. ఎందుకంటే, మీ లోపల ఉన్న పరిపూర్ణత్వముయొక్క సామ్రాజ్యమును, అనంతమైన శాంతిని, మరియు ఆనందమును వారసత్వముగా పొందేది రక్తమాంసాలు కావు. అల్పమైన శరీరస్పృహయొక్క సంతానము అయోగ్యమైనది గావున ఆనందసామ్రాజ్యమునకు అర్హము కాదని త్రోసివేయబడును. ఇట్టివారికి దానియందు తావు లేదు, వారసత్వము లేదు. మీరు మీ అహంకారమనే ఆల్చిప్పను, దేహమనే గూడును, ఆద్యంతరహిత పరమాత్మ అనే సముద్రములోనికి తీసుకుపోలేరు. మీరు ఆ అహంకారమునుండి బయటకు వచ్చి, విశాలమైన జీవనసముద్రముయొక్క అంతర్భాగము కావలసి ఉంటుంది. మీ సంకుచితమైన, భద్రత కోసం ప్రాకులాడే జీవనతరంగము ఒడ్డుకు మాత్రమే తగినది[1]. మీ బిందువు సింధువు (సముద్రము) నందు విలీనమగు గాక! మీరు జీవనసముద్రమునకు, ఆనందఘనమునకు, ఆద్యంతములు లేని తత్త్వముయొక్క స్వాతంత్ర్యమునకు చెందిన, గగుర్పాటును కలిగించే ఆనందమును, అనుభూతికి తెచ్చుకొనుడు.

---

[1] విశాలమైన సముద్రమునందు అంతర్భాగమగుటకు యోగ్యము కాదు.

ఓ! అనంతశూన్యమా[1]! ఆంతరమునందలి ఏకాంతమా!
నీ సొగసులు ఋషులను ఇంకా మురిపిస్తూనే ఉన్నాయి!!

మీరు ఎప్పుడైతే అతిశయి మహిమాన్వితమైన ఆత్మ చైతన్యముయొక్క జాజ్వల్యమాన ప్రకాశమునందు నిలిచి ఉంటారో, అప్పుడు మీరు దేహమునందు ఉన్నారా, లేక దేహమును విడిచి ఉన్నారా అనే విషయమునకు ప్రాముఖ్యము ఏమీ ఉండదు. ఎందుకంటే, ఆ మహిమ భౌతికపదార్థసముదాయమునంతనూ వ్యాపించి విస్తరించి నిండియున్నది. ఆ ఆత్మ చైతన్యముయొక్క వెలుగు ముందు దేనినైననూ దాచిపెట్టుట గాని, కప్పి ఉంచుట గాని సంభవము కాదు. ఆ వెలుగు సర్వమును లోతుగా ప్రవేశించి సర్వమును మార్చి వేస్తుంది. ఆ అనంతసత్యము గాలులను తన రథములుగా చేసుకుంటుంది. ఆ సత్యము మేఘములు మరియు తరంగములపై స్వారీ చేస్తుంది. మిన్ను సింహాసనము కాగా, ఆ పరమాత్మ తన పాదములను భూమిపై మరియు సముద్రముపై నిలిపినాడు. స్వర్గములు ఆ పరమాత్మయొక్క మహిమను గంభీరమైన ధ్వనుల ద్వారా ప్రకటిస్తూ స్తుతిస్తున్నాయి[2]. అంబరమే ఆ పరమాత్మకు వస్త్రము కాగా, ప్రకృతి ఆయనకు ఆభూషణమగుచున్నది. అగ్ని ఆ పరమాత్మకు ముందు మండుతూ పరమాత్మను ప్రవేశపెడ్తోంది[3]. సర్వము ఆ పరమాత్మయొక్క మహోదారమైన చలనచిత్రము మరియు అభివ్యక్తి. సర్వము ఆ పరమాత్మకు సాధనము మరియు పనిముట్టు. ఆయనకు పనికి రానిది గాని, అయోగ్యమైనది గాని, అవరోధము గాని, ఆయన నియంత్రించ లేనిది గాని, ఏదీ లేదు. మీరు ఈ ఎత్తుకు ఎదగండి, ఈ దర్శనములో భాగస్వాములు కండు, తద్ద్వారా మీరు విముక్తులు కండు. ఆ పైన మీరు శాశ్వతకాలము దేహమునందు గాని, ప్రపంచమునందు గాని ఉన్ననూ, అది సమస్యయే కాదు. ఎందుకంటే,

---

[1]నిర్గుణ పరబ్రహ్మను స్వామి ఓంకార్ కొన్ని సందర్భాలలో శూన్యము అని పిలిచినారు; అంటే ఆకాశము వలె, శూన్యమును పోలినది అని భావము.

[2] మేఘగర్జనలు అని స్వామీజీ అభిప్రాయం కావచ్చును.

[3]అగ్నికీలలు పరమాత్మకు సార్వభౌమునకు వలె పతాకలు అని స్వామీజీ అభిప్రాయము కావచ్చును.

వాటియందు ఉంటూనే, వాటి లేపము లేకుండా ఉండుట మీకు తెలుస్తుంది. శాశ్వతమైన సత్యమునందు నిష్ఠ గలవారై స్థిరముగా, స్వగృహమునందు వలె, నిలిచియుండుట మీకు తెలుస్తుంది. దేహమును, ప్రపంచములోని వస్తువులను ఆత్మయొక్క మరియు శాశ్వతసత్యముయొక్క పనిముట్లుగా మార్చివేయడం మీకు తెలుస్తుంది.

మన జన్మహక్కు ఇట్టిది. మనము పరమాత్మయొక్క విభూతికి వారసులము. మనకు ఆ పరమాత్మతో గల అభేదము సాక్షాత్కరించినప్పుడు, అంతే కాదు, ఆ పరమసత్యము నేను ఒక్కటే అనే దర్శనములోనికి మనము మేల్కాంచినప్పుడు, ధ్యానము ధ్యానమే కాదు. ఆ పైన సంకల్పములకు అభ్యాసము అక్కర లేదు, మీరు మనస్సును కూడ ఏకాగ్రము చేయనక్కరలేదు. ఆందోళనను కలిగించే సమస్యలయొక్క గాలివాన చెలరేగి మీ శాంతిస్వరూపము అనే ప్రశాంతమైన సముద్రమును కలచివేసే పరిస్థితి ఉండదు. మీరు ఏకాంతమునందు జీవిస్తూ ఉండగా, కలవరపరచే కర్తవ్యములు మరియు బాధ్యతల బాకా శబ్దములు మీ గుమ్మం ముందు వినబడవు.

భోగలాలసత అంతా మోసమే. అది కంటికి కానరాకుండా సర్వమును మింగివేసే పాము. అది స్వర్గసుఖవాంఛకు ప్రతిరూపమైనది, భౌతికము, స్థూలము, నకిలీది, తుచ్ఛమైనది. నీవు ఇంద్రియములను జయించినవాడవు గనుక, ఆ భోగలాలసత అనే సర్పము దాగి ఉండి తన పడగలను నీపై ప్రసరింపజేయుట సంభవము కాదు. ఆసనబద్ధుడవై ధ్యానము చేసే నీపై అది బుస కొట్టలేదు. ఇప్పుడు సర్వముపై, సర్వపరిస్థితులపై నీకు ఆధిపత్యము గలదు. నీవు సర్వమును జయించి, వశపరచుకొని, ఆ సర్పముపై నాట్యము చేసెదవు[1]. అప్పుడు ఆ సర్వము నీకు వినయవిధేయతలు కలిగి చెప్పిన పనిని ప్రేమతో చేసే నౌకరు వంటిది అగును. నీవు నీ సామ్రాజ్యమును నిర్ధారించి దానిపై

---

[1] స్వామీజీ ఈ సందర్భములో భోగలాలసతను కాలియునితో, ఇంద్రియజయము గల సాధకుని సాక్షాత్తు శ్రీకృష్ణభగవానునితో పోలుస్తున్నారు. అయితే, ఈ పోలిక వాచ్యము కాదు, ధ్వని మాత్రమే.

ఆధిపత్యమును చెలాయిస్తావు. యథార్థముగా భగవంతుని సామ్రాజ్యము నీ లోపలనే ఉన్నది! మృగరాజు అగు సింహము గర్జిస్తూ భయమును కలిగిస్తూంటే, ఇతరమృగములన్నీ భయభీతములై అడవిలో నిశ్శబ్దముగా నక్కి ఉంటాయి. ఇప్పుడు భగవానుడు తన శాంతిసింహాసనమును అధిష్ఠించి ఉన్నాడు! కాబట్టి సకలము వినయవిధేయతలతో, ఆదరభావముతో శాంతములై ఉండి, ఆ భగవానుని ఆదేశములను పాటించు గాక! ఓమ్!

ఇప్పుడు చెప్పండి. ఈ పరిస్థితిలో ధ్యానమునకు అవశ్యకత ఏమి ఉన్నది? ధ్యానము ద్వారా మనము సాధించగోరేది ఇంకా ఏమి మిగిలి ఉన్నది? ఏమీ లేదు, సుతరాము ఏమీ లేదు. కాబట్టి మనము సర్వదా మనము ఏదియో అదియే అయి ఉందాము; బుద్ధిపూర్వకముగా, ఉత్సాహపూర్వకముగా మరియు నిరంతరముగా అదియే అయి ఉందాము. దైవీ సత్తయొక్క మహిమాన్వితమైన సిద్ధాంతము సత్ (ఉనికి) మరియు ఆనందము. అదియే శాశ్వతమైన ఆనందఘనమైన సత్త. కాబట్టి, మనము మన ఈ దేహముయొక్క పుట్టుక అనే భావనను సైతము విస్మరిద్దాము. ఈ దేహమును కూడా విస్మరిద్దాము. మనము నిరంతరముగా మన దైవత్వమును అనుభూతికి తెచ్చుకుందాము. మనము దైవీ సత్త అనే స్వరూపమునందు నిరంతరముగా నిలిచి ఉండని మరియు అనుభూతికి తెచ్చుకోని క్షణమైననూ ఒక్క శ్వాసయైననూ ఉండకుండు గాక!

అంతిమముగా, మిమ్ములను పూర్తిగా నిరుత్సాహపరచుట నాకు సమ్మతము కాదు. మీరు ఆత్మమంత్రము (ఆత్మను సాక్షాత్కరింపజేసే ఫార్ములా, అంటే సూత్రము) ను పిచ్చి ప్రేమతో నానుండి అపేక్షించి ఉన్నట్లైతే, మీ దృష్టిని దానినుండి ఇంకో వైపునకు త్రిప్పే ప్రయత్నమును నేను మీ అనుమతి లేకుండా చేసినాను. ఇప్పుడు[1] మీరు అట్టి ఫార్ములాను పూర్తిగా త్రోసిపుచ్చుటకు తగినంత కారణము[2] గలదు. కావున, మీరు నానుండి ఈ చిట్కాను గ్రహించి, మీరు స్వయముగా సాధన చేయుడు. ఆత్మసాక్షాత్కార-ఫార్ములాయొక్క ఉపదేశము మరియు తాయెత్తు రెండు

---

[1] నా విస్తృతమైన వివరణను విన్న తరువాత అని అభిప్రాయము.
[2] మీరు సర్వదా ఆత్మస్వరూపులై ఉండుటయే.

కలిపి ఇదియే (ఆత్మనిష్ఠయే). ఇది ఇట్లు ఉండును; దీనిని మీరు మనస్సులో అనుసంధానము చేయుడు: ఓమ్! నేను సచ్చిదానంద స్వరూపుడను! నేను అఖండసద్రూపుడను! నేను అఖండచిద్రూపుడను! నేను అఖండ-ఆనందస్వరూపుడను! నేను సర్వమునందు సర్వమునై ఉన్నాను! చూడబడినది మరియు చూడబడనిది సర్వము యథార్థముగా నేనే! భూతభవిష్యద్వ ర్తమానములు నేనే! నాకంటె వ్యతిరిక్తముగా ఏదీ లేదు!

అ తరువాత మిమ్ములను మీరు ఇట్లు ప్రశ్నించుకొనుడు: సత్యము అట్లు ఉండగా, నేను ఒక స్థానమునకు, లేదా ఆసనమునకు పరిమితమై ఉండగల్గుతానా? నేను అంతటా లేనూ? ఉదాహరణకు, నేను కేవలము ఈ నా చిన్ని కన్నులతో మాత్రమే చూస్తున్నానా?

అప్పుడు మీకు మీరే ఇట్లు సమాధానమును చెప్పుకొనుడు: నేను ఈ నా కన్నులలో ఉన్నట్లైతే, నేను మిగిలిన కన్నులన్నింటియందు కూడా ఉండి తీరాలి! నేను ఈ చెవులలో ఉన్నట్లైతే, చెవులన్నింటియందు ఉండి తీరాలి! నేను ఈ చేతులలో ఉన్నట్లైతే, నేను చేతులన్నింటియందు ఉండి తీరాలి! నేను ఈ కాళ్లయందు ఉన్నట్లైతే, నేను కాళ్లు అన్నింటియందు ఉండి తీరాలి! ఇత్యాది.

మరల ఇట్లు సంకల్పించుడు: సర్వము నేనే అయి ఉండగా, నాకంటె భిన్నముగా ఉన్నది యెవరు? నన్ను ఒక విశిష్టమైన నామరూపములకు పరిమితము చేసే ఇతరవ్యక్తి యెవరు ఉన్నారు? అట్టి ఇతరవ్యక్తి ఉన్నట్లైతే, ఆ విధముగా ఆతనియందు మరియు ఆతని ద్వారా చేస్తున్నది నేనే కాదా? ఆతడు సంకల్పించినట్లైతే, నేనే ఆతని లోపల సంకల్పిస్తున్నాను! ఆతని గుండె కొట్టుకుంటున్నట్లైతే, నేనే ఆ గుండెయందు కొట్టుకుంటున్నాను! ఆతడు గాలి పీలుస్తూంటే, ఆతనియందు నేనే గాలి పీలుస్తున్నాను! అన్ని సంకల్పములయందు, అన్ని మనస్సులయందు నేనే సంకల్పిస్తున్నాను! శ్వాసకోశములన్నింటియందు నేనే గాలి పీలుస్తున్నాను! గుండెలన్నింటియందు నేనే స్పందిస్తున్నాను! సర్వమునందు సర్వము నేనే! బ్రహ్మాండము నేనే! అఖండసత్యము నేనే!

అంతిమంగా ఇట్లు తలపోయుము: సకలసత్తయొక్క సత్, అంతిమనిధానము, మూలస్రోతస్సు కూడ నేనే! సర్వము నానుండియే ఆవిర్భవించి, నాయందే మనుగడ గలదియై, నాయందే విలీనమగుచున్నది!

సకలజగత్తుయొక్క ఊపిరియందు ఉంటూ నేను ఊపిరి పీలుస్తున్నాను అని తలపోయుట! ఆహా! ఈ దైవత్వము నిండిన మాటలు ఎంత సత్యములో! అవి ఎంతటి శక్తితో నిండి యున్నవో! సకలప్రాణుల జీవశక్తి నేనే! సకలప్రాణుల ఆత్మ నేనే! నేను అందరితో ఒక్కడిని, అందరిద్వారా మరియు అందరి కొరకు ఒక్కడిని. ఆహా! దీవెనలతో నిండిన సంకల్పము! అట్టిచో నన్ను నానుండి ఎవరు విడదీయగలరు? నన్ను ఖండితము చేయగలరా? ఏకత్వము తనయందు తాను విడదీయబడగలదా? లేక, ఏకత్వమునందు భేదము ఉండగల్గునా? గొప్ప అద్వయ-ఆత్మను రెండుగా చేయుట సంభవమేనా? బహుశః ఆ రెండు ముక్కలలో ఒక ముక్క రెండవదాని అర్ధాంగి[1] అగునేమో? అయితే, అది యెప్పటికైనా యథార్థమైన విభజన యగునా? ఆ ద్వైతము మళ్లా అద్వైతము, మరింత గట్టిగా అతుకుకొని ప్రజ్వరిల్లే అద్వైతము అయిపోవును. ఈ అద్వైతమునందు ప్రేమ నిండియుండును. నేను నా మరీ మంచిది మరియు మరీ మధురమగు అర్ధాంగమును ఏ కారణముచేతనైనా ఎక్కువ గాని, తక్కువ గాని ప్రేమించగల్గుదునా? స్వస్థచిత్తము (విచక్షణ) గల జీవము ఏదైనా తనదైన ఆత్మనే ద్వేషించెనా? అసంభవము, ఎన్నటికీ సంభవము కాదు.

కాబట్టి మీ హృదయపు లోతులలో ఈ విధంగా చెప్పుకోండి: నాకు అత్యంతప్రేమపాత్రమైన ఓ ఆత్మా! నన్ను నిందించేవారు, శత్రువులు మరియు మిత్రుల రూపములో నీవే ఉన్నావు. ఒకే ఆత్మ ఈ తప్పు పేర్లతో పిలువబడుతోంది. నా యథార్థస్వరూపమునందు మిత్రుడు లేడు, శత్రువు లేడు. అందరు నాకు ప్రియమైన ఒకే ఒక ఆత్మయే. అయ్యా! నాకు మీకు భేదమే లేదని తెలుసుకోండి. శాశ్వతకాలము నాకు మీతో ఏకత్వము అనుభూతికి వచ్చుగాక! నా సోదరులారా! సోదరీమణులారా! మీరు నా

---

[1] ఒకే పరమాత్మ శివశక్తుల రూపముగా ప్రకటమగుటను స్వామీజీ భావిస్తూ ఇట్లు చెప్పియుందురు.

ఆత్మయే! నేను మీ ఆత్మయే! మనము ఒక్కటియే, ఏ నాడూ విడిపోలేదు! మనలను మన ఏకత్వమునుండి ఎవరు లేక ఏది విడదీయగలదు? మనల్ని కలిపినది దేవుడు, దైవీ చేతన! మానవుడు గాని, దేహాభిమానము గాని, అహంకారము గాని మనలను ముక్కలుగా విడదీయకుండుగాక! మనము మన ఏకత్వమునందు జీవించాలి, ఏకత్వ-అనుభూతిని పొందాలి, మన ఏకత్వమును సాధించుకోవాలి. మనము ఏకత్వమునందు వృద్ధి జెందాలి. మనము భూలోకస్వర్గలోకముల శక్తులనన్నింటినీ ఆ ఏకత్వమునందే వశము చేసుకోవాలి. ఓ ప్రియబాంధవులారా! ఇది మీకు ఆత్మమంత్రము అగుగాక!

ఆహా! సర్వముతో మరియు సర్వమునందు ఏకత్వముతో మరియు సర్వమునందలి సర్వము అగు పరమాత్మతో విడదీయరాని అభేదముయొక్క అనుభూతిలోని పరమానందము! ఏ పదములు ఆ ఆనందమును వర్ణించగలవు! ఆహా! సర్వాత్మభావముయొక్క జాజ్వల్యమానమైన ప్రేమయొక్క సర్వాతిశాయియగు మహిమ! ప్రేమయొక్క భాషను మినహాయిస్తే, ఆ మహిమను ఏ భాష వర్ణించగలదు![1] ఆహా! అల్పమైన అహంకారమునకు, అల్పమైన నేను-భావనకు సిలువ వేసి, సర్వాత్మను లేదా విశ్వాత్మను గొప్పగా స్తుతించుట అనే స్ఫూర్తిప్రదమగు ఆలోచనయే మహోన్నతమగు గాక! నేను-ను అవమానములనుండి సిలువ వేయుట ద్వారా పరిచ్ఛేదములకు అతీతముగా పైకి తీసుకు రాగల్గినచో, నేను మానవులనందరినీ నా స్వరూపములోనికి కొని తెచ్చెదను అనే గొప్ప వచనములను మరల తలపోయుడు. ఏమి గొప్ప ఆత్మ! ఏమి గొప్ప భావన! సిలువయొక్క రహస్యము అదియే. ప్రాచీనమైన స్వస్తిక ముద్రకు, లేదా ఎప్పుడూ తిరుగుతూ ఉండే బ్రహ్మాండచక్రమునకు కూడ అంతరార్థము అదియే. అదియే గొప్ప ఆకర్షణకు మరియు ప్రకాశమునకు కేంద్రము. దానియందు సకలప్రాణుల తండ్రి అనియు, ఆ తండ్రి సర్వులను తనలోనికి ఆకర్షించుననియు మహోన్నత భావనలు (సిలువ ఇత్యాదుల

---

[1] భాషకు అందనిది అని అభిప్రాయము. ప్రేమయైతే భాషకు అతీతము.

రహస్యార్థము) గలవు. ఎప్పుడైతే మానవుడు ఈ సత్యమును ఆవిష్కరించుకొని, ఈ పరమసత్యముతో తన ఏకత్వమును సాక్షాత్కరించుకొనునో, అప్పుడు పరిచ్ఛిన్నమైన నేను-భావన ఇంకెంత మాత్రము ఉండదు; అట్టివానికి అనంతమైన నేను-భావన నిలిచియుండును. అల్పమైన మరియు విశిష్టమైన (ఫలానా గా వ్యవహరించే) **వ్యక్తి** సర్వమును మించి **సర్వాత్మ**లోనికి, **విశ్వాత్మ**లోనికి ఎదిగిపోవును.

మహాశూన్యముయొక్క వర్ణించ శక్యము కాని విస్తారము మరియు శాంతి, తరంగములు లేని సముద్రమును పోలియుండును. సంకల్పరహితమైన మానవమేధ, స్వయంప్రకాశమైన దైవత్వమహిమ అనేవి అనుభవించదగ్గవే గాని, మాటలలో వర్ణించుట ఎన్నటికీ సంభవము కాదు; రంగుల కుంచెలతో చిత్రించుట గాని, మనస్సుతో ఊహించుటయైనా గాని సంభవము కాదు. అవి మానవుని తర్కమునకు మరియు భావనాశక్తికి అతీతములు. ఆహా! నేను వాటిని అనుభవిస్తున్నాను, నేను వాటి అనుభూతిని పొందుతున్నాను! కాని, వాటిని నేను నోటి మాటలలో చెప్పలేను! వాటికి అవి తప్ప వేరే భాష లేదు. వాటిని మనం లోపల గాఢముగా యెరగాలి, అనుభూతికి తెచ్చుకోవాలి. పొంగి పొరలుతున్న ఆనందముతో హృదయము కరిగి బాష్పములు ప్రవహించుగాక! నాయందు నేను ఇప్పుడు అట్టి ఆనందబాష్పముల అనుభూతిని ఎంతో అధికముగా పొందుతున్నాను!

ఓమ్ శాంతిః శాంతిః శాంతిః, హరిః ఓమ్, తత్ సత్.

# తత్ త్వమ్ అసి
# అది నీవే అగుచున్నావు

(స్వామి ఓంకార్ మహారాజువారి బోధలకు ఆంగ్లములో
గేయరూపమునిచ్చినవారు సాధు ఐక్యానంద)

దైవాంశుడవైన ఓ జీవుడా! భూతభవిష్యద్వర్తమానములయందు
అది నీవే అగుచున్నావు!
నీవు అది కాకుండా నీవైననూ చేయజాలవు
ఎందుకంటే మాయ స్వప్నాలను లేక నీడలను ప్రకటిస్తుంది
నీవు సర్వాతీతమగు సత్తవు
నీవు పూర్ణమైన ఆనందమవు, నిరంకుశమైన జ్ఞానమవు
సత్యము రెండవది లేని ఒక్కటి
ఆ సత్యము నీవే అగుచున్నావు
ఆ దైవత్వము మాత్రమే ఉన్న ఒంటరివి నీవు.

తేజస్సు నీ వారసత్వము, నీ సొత్తు, నీ దైవాంశ
అట్టి నీ తేజస్సును ఇప్పుడే ప్రదర్శించుము
దానిని మరల చాటి చెప్పడం ఇప్పటికే ఆలస్యమైంది
నీవు నిన్ను నీ సొంత ప్రకాశంలో నిలుపుకో
నీవు సహజసిద్ధంగా ఏది అయ్యే ఉన్నావో
అది అవడానికి కష్టపడిపోకు
నీవు కేవలము ఆ దైవస్వరూపుడవై ఉండుము
నీ స్వంతమైన దైవత్వమును తప్పించి
మరి యేదీ అగుటను మానివేయుము.

నీకు చావు పుట్టుకలు దూరముగా ఉండగా
నీకు కోరదగ్గది ఏమున్నది?
వృద్ధి మరియు మార్పు నీ సామ్రాజ్యము నుండి మరుగై ఉండగా

నీవు విడిచిపెట్టుట గాని, సాధించుట గాని ఆవశ్యకమా?
సూర్యునినుండి అణువు వరకు ఏదీ
నీ మహిమను దాటి వెళ్లలేదు
నీవు అనంతకాలము సూర్యులకు సూర్యుడవు
నీ మహిమ ఊహకు అందేది కాదు
నీ దైవత్వముయొక్క మహిమయందు వన్నె గాంచుము.

జ్యోతులకు జ్యోతివి నీవే, నీ ప్రకాశమునకు కొలత లేదు
పరిమితమైన ప్రకాశము కొరకు నీవు యాచిస్తావా?
ఆహా! నీవు బ్రహ్మానందసంపన్నుడవు!
నీవు అల్పసుఖాల కోసం నీచవినయాన్ని చూపిస్తావా?
నీవు సత్యములోనికి మేల్కాంచడం, అల్పమైన ప్రయాసలను
త్రోసిపుచ్చడం ఇప్పటికే ఆలస్యమైంది
ప్రార్థన, సాధన, లేదా ధ్యానములను గట్టిగా ఆశ్రయించుట
నీకు, ఓ అమృతపుత్రుడా! సిగ్గు చేటు.

నీకంటె భిన్నంగా ఏదీ లేనప్పుడు
ప్రార్థనలలో సొగసు ఏమున్నది?
సర్వమునందలి సర్వము నీవు మాత్రమే అయి ఉండగా
ధ్యానము చేయదగ్గది వేరే ఏమున్నది?
లోహానికి పదును పెట్టేది లోహమే
వజ్రమును కోసేది వజ్రము మాత్రమే
కరిగించిన బంగారం బంగారంతో కలిసిపోతుంది
విభిన్నపదార్థములు కలియుట సంభవమే కాదు
పరమాత్మయొక్క స్వరూపము కూడ అట్టిదియే.

దైవత్వమును పొందుట (దైవము అగుట) కై ధ్యానము
లేదా దైవీ స్వరూపమును సంపాదించుటకై ధ్యానము విడ్డూరము
అనంతసత్యముయొక్క సంతానమునకు

దైవము కాదన్నట్లు ఉండుట తగదు, తప్పు
మీ దైవత్వమును గుర్తించండి
నిశ్శబ్దంగా ఉండండి, అంతే.
శాంతముగా మీయందు మీరు ఉండుడు
నేనే దైవము అనే ఒక్క సత్యమును తెలియుడు
ఇదియే దైవత్వమునకు చెందిన ధ్యానము.

ఓ మహిమాన్వితమైన జ్యోతీ! నిశ్శబ్దముగా ప్రకాశించుము
విశ్రాంతిని యెరుగని ఆస్తిపాస్తుల జ్వరమునంతనూ
తిరిగి తలయెత్తని విధముగా దెబ్బ తీయుము
ఆత్మనిష్ఠుడవై శాంతముగా నీయందు నీవు ఉండుము
సర్వమునందలి సర్వాత్మ అగు నీవు నీయందు నిలిచి ఉండుము
పెద్ద వయస్సు వచ్చి పరిణతి చెందిన ఆత్మవీవు
పేరు ప్రతిష్ఠలు నీకు ఆట వస్తువులు మాత్రమే
నామరూపములకు అతీతమైన ఊహకు అందని కీర్తి
ఇప్పుడు ఇక్కడ నీ దైవీ సత్తయందు నిహితమై ఉన్నది.

నీవు ప్రాణము-ఆనందముల సముద్రమవు
సకలప్రాణులు నీయందు సంతోషముతో విలీనమౌతున్నాయి
మండే ఎడారిలోని ఎండమావులవంటి ప్రాపంచికకామనలు
నిన్ను పరుగులు పెట్టిస్తాయా?
ఉన్న ఈ సర్వమునకు నీవు బాహ్యమునందలి సాక్షివి!
సర్వముయొక్క మూలస్రోతస్సు, మనుగడ, నిధానము నీవే
నీవు **అది** యై నిలబడగలిగితే
ప్రలోభపెట్టే స్వప్నములన్నీ నీ ప్రక్కనుండి వెళ్లిపోతాయి
నీవు మేరునగధీరుడవై దైవస్వరూపుడవై నిలిచి ఉంటావు.

ప్రియమైన ఓ పాఠకుడా! నీవు దీనిని చదువుతూండగానే
అది నీవే అయి ఉన్నావు అనే సత్యాన్ని ఒకే ఒక్క సారి తెలుసుకో

ప్రతి శ్వాస నీ నిశ్శబ్ద దైవత్వమును కొనియాడు గాక!
నీ నిశ్శబ్దమైన సర్వాతిశాయి ప్రేమను కూడ కొనియాడు గాక!
నీ విశ్వవ్యాపకమైన ప్రేమతో నిండిన సత్తయందు
వ్యక్తములు మరియు అవ్యక్తములు అగు వస్తువులు నిమగ్నమగు గాక!
బుడగలవంటి పరిచ్ఛిన్న విశ్వములు నీ అనంతమగు
బ్రహ్మానందాంబుధియందు విలీనమగు గాక!
నీ దైవత్వముయొక్క మహిమయందు విశ్రమించు గాక!

* * * * *